Truth of News
PRGI Reg No: APTEL/26/A4782
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

అసత్యంతో సాధించిన
విజయం కంటే..
సత్యంతో సాధించిన
పరాజయమే మేలు
- మహాత్మా గాంధీ

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 02 | సంచిక : 05 | శుక్రవారం 31 జూలై 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## కేంద్ర హోం మంత్రి సభకు రావాలి

- విద్యార్థులపై దాడికి ఎవరు ఆదేశాలిచ్చారు?
- రామ మందిర దోపిడీపై కేంద్రం వివరణ ఇవ్వాలి
- యూపీ ప్రభుత్వ విచారణ ఒక బూటకం
- పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్షాల వినూత్న ఆందోళన
- నినాదాలతో హోరెత్తించిన ఎంపీలు




న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

విద్యార్థులపై పోలీసుల చర్య, అయోధ్యలోని రామ మందిరంలో చందాచోరీకి నిరసనగా పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. గురువారం ఉభయ సభల ప్రారంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలో మకర ద్వారం వద్ద ప్రతిపక్ష ఎంపీలు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. రామ మందిరంలో విరాళాల దొంగతనాన్ని తెలిపేలా... హుండీలో ఎంపీలు డబ్బులు వేస్తూ నిరసన తెలిపారు. 'అధికార దొంగలు', 'చందాల దొంగలు', 'కేంద్ర హోం మంత్రి సభకు రావాలి', విద్యార్థులకు దాడికి ఆదేశాలు ఎవరిచ్చారు' అని నినాదాలతో హోరెత్తించారు. ప్రశ్నాపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై అణచివేతకు ఆదేశించినందుకు హోం మంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు పార్లమెంటు లోపల, వెలుపల తమ నిరసనలను కొనసాగిస్తున్నాయి. ఢిల్లీ పోలీసులు, కేంద్ర బలగాలు విద్యార్థులను, యువతను కొట్టడానికి అనుమతిస్తూ అమిత్ షా నేరపూరిత

- మిగతా 2లో..

## అమిత్ షా మౌనం దేనికి?

- ఢిల్లీ ఘటనపై నోరు విప్పాలి
- విద్యార్థులు ఏమైనా ఉగ్రవాదులా? వారిపై లాఠీఛార్జ్‌కు ఆయనే బాధ్యుడు
- పేపర్ లీక్‌ను ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు పరిష్కరించవు
- ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీని విధించింది
- రాజ్యసభలో కేంద్రాన్ని నిలదీసిన ప్రతిపక్షాలు



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

నీట్ ప్రశ్న పత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం ఆందోళనకు దిగిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులపై బాష్పవా యువు కూడా ప్రయోగించారని తెలిపారు. పోలీసుల తీరుపై కేంద్రం హోం శాఖ మంత్రి అమిత్ షా ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. గురువారం రాజ్యసభలో పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026 (యాంటీ పేపర్ లీక్ లా)ను కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ప్రవేశపెట్టారు. లోక్‌సభలో ఆమోదం పొందిన

- మిగతా 2లో..



## రాహుల్ గాంధీపై ప్రివిలేజ్ నోటీస్

- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు అందజేసిన బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి వ్యతిరేకంగా బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ గురువారం ప్రివిలేజ్ (సభా హక్కుల ఉల్లంఘన) నోటీసు, సభా ధిక్కరణ నోటీసును లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు అందజేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై 'అనుచితమైన, అవమానకరమైన భాషను ఉపయో గించడం, తీవ్రమైన, నిరాధారమైన ఆరోపణలు చేయడం' పై ఈ నోటీసులు ఇస్తున్నట్టు బీజేపీ ఎంపీ తెలిపారు. మూడు పేజీల నోటీసులో తన అభియోగాలపై సవివరమైన విచారణ, తగిన చర్య కోసం ప్రివిలేజ్ కమిటీకి నివేదించాలని, అలాగే సభకు, కేంద్ర మంత్రి అమిత్ షాకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని రాహుల్ గాంధీని ఆదేశించాలని స్పీకర్ ఓం బిర్లాను నోటీసులో అనురాగ్ ఠాకూర్ కోరారు. పేపర్ లీక్ నిరోధక బిల్లుపై బుధవారం జరిగిన చర్చ సందర్భంగా రాహుల్‌గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారనీ, రూల్ 352ను ఉల్లంఘించారని ఆయన తెలిపారు.

## కోవిడ్ గుణపాఠం నేర్వని
# మోడీ సర్కారు

- భవిష్యత్ మహమ్మారుల సన్నద్ధతపై కేంద్రం నిర్లక్ష్యం
- ఇలాంటి వ్యాధుల నివారణ పరిశోధనకు ప్రత్యేక నిధుల్లో పూర్తి కోత
- 2026-27లో ఒక్క రూపాయి కేటాయించని వైనం
- ఏటికేడూ బడ్జెట్‌లో కోతలు విధిస్తూ వచ్చిన ప్రభుత్వం
- ఎన్డీఏ సర్కారు తీరుపై నిపుణుల ఆందోళన



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

కోవిడ్-19 మహమ్మారి దేశ ఆరోగ్య వ్యవస్థలో బలహీనతలను బట్టబయలు చేసినప్పటికీ మోడీ సర్కారు దాని నుంచి గుణపాఠం నేర్చినట్టు కనిపించటం లేదు. భవిష్యత్తులో వచ్చే మహమ్మారులు, అంటువ్యాధులను ఎదుర్కొనే పరిశోధనకు అవసరమైన ప్రత్యేక నిధులను కేంద్రం పూర్తిగా ఎత్తివేయడం ఇప్పుడు తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఒకవైపు ఆరోగ్య పరిశోధన బడ్జెట్ పెంచామని గొప్పలు చెప్పుకుంటున్న మోడీ ప్రభుత్వం.. మరోవైపు మహమ్మారుల నివారణ, ముందస్తు గుర్తింపు, పర్యవేక్షణ కోసం ఉద్దేశించిన ప్రత్యేక పరిశోధన పథకానికి 2026-27 బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం అనేక సందేహాలు రేకెత్తిస్తోంది. ?జులై 21న రాజ్యసభలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రజాప్రావ్ జాధవ్ ఇచ్చిన లిఖితపూర్వక సమాధానం ప్రకారం.. ఆరోగ్య పరిశోధన శాఖ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ రీసెర్చ్-డీహెచ్ఆర్) బడ్జెట్ 2023-24లో రూ.2, 892 కోట్ల నుంచి 2026-27లో రూ.4,821. 21 కోట్లకు పెరిగింది. నాలుగేండ్లలో దాదాపు 67 శాతం పెరిగిన ఈ బడ్జెట్‌ను ప్రభుత్వం ఒక విజయంగా ప్రచారం చేసుకుంది. అయితే 'వ్యాధుల వ్యాప్తి, మహమ్మారులను నివారించేందుకు అవసరమైన సాధనాల అభివృద్ధి, మద్దతు' పేరుతో ఉన్న ప్రత్యేక పథకానికి నిధులను పూర్తిగా నిలిపివేయడం విరుద్ధ సంకేతాలను ఇస్తోందనినిపుణులు

- మిగతా 2లో..



## అమిత్ షా రాజీనామా చేయాలి

- సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే డిమాండ్
- పోలీసులు రాజ్యాంగాన్ని అనుసరించాలి
- అణచివేత చర్యలకు ఆదేశాలిచ్చింది ఆయనేనని వ్యాఖ్యలు

ఛత్రపతి శంభాజీ నగర్ - సూర్య వాస్తవం

ఇటీవల జంతర్ మంతర్ వద్ద నిరసన చేస్తున్న విద్యార్థులపై అణచివేత చర్యలకు పోలీసులను ఆదేశించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే డిమాండ్ చేశారు. కొత్త విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషిని నియమించడాన్ని కూడా ఆయన విమర్శించారు. జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు జరిపిన ఆందోళన హక్కుల కోసం వారు జరిపిన పోరాటంగా అభివర్ణించారు. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న రైతాంగ ఉద్యమాలకు దీప్కే మద్దతు

- మిగతా 2లో..

## 2034 వరకు
# సీఎంగా కొనసాగుతా..

- విద్యలో తెలంగాణను అగ్రస్థానంలో నిలుపుతా : సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ - సూర్య వాస్తవం

రాష్ట్ర అభివృద్ధి కోసం విమర్శలను పట్టించుకోకుండా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ దాశరథి ఆడిటోరియంలో ఫిన్‌లాండ్, జర్మనీ ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ అభివృద్ధికి విద్యే ప్రధాన బలం అని పేర్కొన్న సీఎం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యత పెంపుతో పాటు విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచి ప్రజల సంక్షేమానికి వినియోగించడమే తమ లక్ష్యమని చెప్పారు. విద్యాశాఖకు రాజీనామా చేయాలంటూ వస్తున్న విమర్శలను ప్రస్తావిస్తూ, పిల్లలకు అల్పాహారం అందించడం, ఐటీఐల స్థానంలో ఏటీసీల ఏర్పాటేనా తన తప్పు అని ప్రశ్నించారు. ఉపాధ్యాయుల సమస్యల బాధ్యతను తానే తీసుకుంటానని, విద్యార్థుల ప్రయోజనాల కోసం ఉపాధ్యాయ

- మిగతా 2లో..

## ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల
# ఎంపిక ఆంధ్రప్రదేశ్

- గత ప్రభుత్వ చర్యలతో పెట్టుబడిదారుల విశ్వాసం కోల్పోయిందని వ్యాఖ్య
- త్వరలో ఆంధ్రప్రదేశ్ నుంచి విదేశాలకు క్లీన్ ఎనర్జీ ఎగుమతులు
- పరిశ్రమలు తేవడం మా బాధ్యత.. కష్టపడటం యువత బాధ్యత
- టాటా రెన్యువబుల్ ఎనర్జీ శంకుస్థాపన సభలో మంత్రి నారా లోకేష్

పత్తికొండ - సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల తొలి ప్రాధాన్యతగా మారిందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. బ్రూక్‌ఫీల్డ్, బ్లాక్‌స్టోన్, బ్లాక్‌రాక్, ఈక్యూటీ, టీపీజీ వంటి ప్రతిష్టాత్మక గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ ఫండ్‌లు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయని, టాటా పవర్, సుజ్లాన్, రెన్యూ, ప్రీమియర్ ఎనర్జీస్, ఏసీఎంఈ, వారీ వంటి ప్రముఖ భారతీయ దిగ్గజ సంస్థల తమ కార్యకలాపాలను ఇక్కడ



విస్తరిస్తున్నాయని ఆయన వెల్లడించారు. పత్తికొండ సమీపంలోని హోసూరు వద్ద టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## కోవిడ్ గుణపాఠం నేర్వని
# మోడీ సర్కారు

(మొదటిపేజీ తరువాయి)

ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**డబ్ల్యూహెచ్ఓ హెచ్చరికలూ బేఖాతరు**

కోవిడ్-19 మహమ్మారి ప్రపంచవ్యాప్తం గా లక్షలాది మంది ప్రాణాలను బలిగొన్న విషయం విదితమే. ఇది ఆయా దేశాల్లో ఆరోగ్య వ్యవస్థలను కుదేలు చేసింది. ప్రస్తుతం కూడా ఎంపాక్స్, హెచ్5ఎన్1 పక్షుల ఫ్లూ వంటి కొత్త అంటువ్యాధుల ముప్పు ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో వ్యాధులను ముందుగానే గుర్తించే వ్యవస్థలు, వేగవంతమైన నిర్ధారణ సాంకేతికత, పరిశోధనలపై నిరంతర పెట్టుబడులు అవసరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) కూడా పదేపదే హెచ్చరిస్తోంది. అయినప్పటికీ మోడీ ప్రభుత్వం ప్రత్యేక పరిశోధన నిధిని నిలిపివేయడం ఆందోళనకరమని వైద్య, ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

**సమర్థించుకుంటున్న కేంద్రం**

ప్రభుత్వం మాత్రం మహమ్మారుల సన్నద్ధతకు ఇతర పథకాల ద్వారా నిధులు కేటాయిస్తున్నామని సమర్థింపులు చేసుకుంటోంది. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద బయోసెక్యూరిటీ సన్నద్ధత, మహమ్మారి పరిశోధనలు, నేషనల్ వన్ హెల్త్ మిషన్ కోసం 2026-27లో రూ.351.06 కోట్లు, వైరల్ రీసెర్చ్ అండ్ డయాగ్నస్టిక్ ల్యాబొరేటరీస్ (వీఆర్‌డీఎల్) పథకానికి రూ.70 కోట్లు, వైద్య కళాశాలల్లోని మల్టీ-డిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్స్ (ఎంఆర్‌యూలు) కోసం రూ.100.27 కోట్లు కేటాయించినట్టు ప్రచారం చేసుకుంటోంది.

**పథకం కొనసాగింపు పైనా స్పష్టత కరువు**

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... ఈ ప్రత్యేక పథకాన్ని నిలిపివేశారా లేదా దాని కార్యకలాపాలను ఇతర పథకాలలో విలీనం చేశారా అన్నది మాత్రం కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ఇచ్చిన సమాధానంలో ఎలాంటి వివరణా ఇవ్వలేదు. కోవిడ్ మహమ్మారి నేర్పిన గుణపాఠాలను మర్చిపోయి.. ప్రత్యేక అంటువ్యాధుల నివారణ పరిశోధనకు నిధులు నిలిపివేయడం ద్వారా మోడీ ప్రభుత్వం ప్రజారోగ్య భద్రతను నిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కరోనాతో పాటు మరికొన్ని వ్యాధుల వ్యాప్తి ఇటీవలి కాలంలో పెరుగుతున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో కేంద్రం ఇప్పటికైన జాగ్రత్తగా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు.

**ఏటికేడూ నిధుల్లో కోతలు**

ఈ పథకానికి కేంద్రం బడ్జెట్‌ను ఏటికేడూ కోతను విధిస్తూ వస్తోంది. 2023-24లో రూ.10 కోట్లు, 2024-25లో రూ.8 కోట్లు కేటాయించిన మోడీ సర్కారు.. 2025-26లో రూ.3.67 కోట్లకు మాత్రమే పరిమితం చేసింది. ఇక 2026-27లో మాత్రం ఎలాంటి కేటాయింపులూ లేకపోవడం గమనార్హం. కొత్త నిర్ధారణ పరీక్షలు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, అంటువ్యాధుల పర్యవేక్షణ, నియంత్రణకు అవసరమైన పరిశోధనలకు ఈ పథకం మద్దతు అందించేది. కొత్తగా ఉద్భవించే, మళ్లీ వ్యాపించే అంటువ్యాధులను ముందుగానే అడ్డుకునే సామర్థ్యాన్ని పెంచడమే దీని లక్ష్యం.

**భవిష్యత్తు పరిశోధనలపై ప్రతికూల ప్రభావం**

అయితే వైద్య, ఆరోగ్య నిపుణులు మాత్రం కేంద్రం తీరుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ ఆరోగ్య మౌలిక సదుపాయాలకు నిధులు కేటాయించడం ఒక అంశమైతే, భవిష్యత్ మహమ్మారులను అడ్డుకునే కొత్త సాంకేతికతలు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించడం మరో అంశమని చెప్తున్నారు. అలాంటి ప్రత్యేక పథకాన్ని రద్దు చేయడం వల్ల భవిష్యత్తులో వచ్చే మహమ్మారులను ఎదుర్కొనే పరిశోధనలపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

# కేంద్ర హోం మంత్రి సభకు రావాలి

(మొదటిపేజీ తరువాయి)

మౌనం పాటిస్తున్నారని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు ఉభయ సభలలోనూ తీవ్రంగా నిరసన తెలిపాయి. తీవ్ర నిరసనల కారణంగా లోక్‌సభను శుక్రవారానికి వాయిదా వేసినప్పుడు, రాజ్యసభలో ప్రభుత్వ పరీక్షలలో అవకతవకలను నిరోధించే బిల్లుపై చర్చ సందర్భంగా ప్రతిపక్షాలు అమిత్ షాపై కూడా విరుచుకుపడ్డాయి. తీవ్ర నిరసనల కారణంగా ఉభయ సభల కార్యకలాపాలకు పలుమార్లు అంతరాయం కలిగింది.

'శాంతియుతంగా ఆందోళన చేపట్టిన విద్యార్థులపై లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం, ఏకే 47 ఎక్కు పెట్టాలని ఆదేశాలు ఎవరిచ్చారు? విద్యార్థుల వేటకు ఎవరు ఆదేశించారు?' అని రాసి ఉన్న భారీ బ్యానర్లను ప్రదర్శిస్తూ ప్రతిపక్షాలు పార్లమెంటు గేటు వద్ద కూడా తమ నిరసనను కొనసాగించాయి. ప్రతిపక్షాలు రాజకీయ దురుద్దేశాలతో సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తున్నాయని అధికార పార్టీ ఆరోపించింది. ప్రభుత్వం ఏ విషయంపైనైనా చర్చకు సిద్ధంగా ఉందని, కానీ ప్రతిపక్షాలు చర్చకు సిద్ధంగా లేవని కేంద్ర మంత్రి జెపి నడ్డా ఆరోపించారు. జంతర్ మంతర్ వద్ద యువకులను వేటాడటంపై ఉభయ సభలలో ప్రతిపక్షాలు నిరసనలు తెలుపుతున్నప్పటికీ, ప్రధానమంత్రి, హోం మంత్రి పార్లమెంటుకు కనపడకుండా దాక్కుంటున్నారు. ఏసీ గదుల్లో పిల్లలను కొట్టమని ఆదేశించిన తర్వాత హోం మంత్రి బాధ్యత తీసుకోకుండా పారిపోతున్నారని రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. 'మిమ్మల్ని ఏసీ గది నుంచి బయటకు లాక్కెళ్తారు' అన్న ఖర్గే వ్యాఖ్యను అధికార పార్టీ వ్యతిరేకించింది.

కేంద్ర ప్రభుత్వంపై దేశంలోని విద్యార్థులు, యువతలో ఉన్న తీవ్ర ఆగ్రహాన్ని తన వ్యాఖ్య ప్రతిబింబిస్తోందని ఖర్గే వివరించినప్పటికీ.. ఆ వ్యాఖ్యపై ఎన్డీఏ సభ్యులు గందరగోళం సృష్టించారు. మొన్నటి రోజున లోక్‌సభలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కూడా అధికార పార్టీ పెద్ద గందరగోళం సృష్టించింది. ఇదిలా ఉండగా, వందేమాతరంను అవమానించడాన్ని నేరంగా పరిగణించే సవరణ బిల్లును లోక్‌సభ కూడా మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఈ బిల్లును మొన్న రాజ్యసభ కూడా ఆమోదించింది. వందేమాతరంను అవమానించినందుకు మూడేండ్ల వరకు జైలు శిక్ష విధించే సవరణ బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. జంతర్ మంతర్ వద్ద పోలీసుల అరాచకాలపై విచారణ జరిపేందుకు స్వతంత్ర న్యాయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌పై చర్చ జరపాలని, సభా కార్యకలాపాలను వాయిదా వేయాలని కోరుతూ సీపీఐ(ఎం) రాజ్యసభ నాయకుడు జాన్ బ్రిట్టాస్ నోటీసు ఇచ్చారు. విద్యార్థులపై పోలీసుల అరాచకాలు, ఏకేజీ భవన్‌లో ఢిల్లీ పోలీసులు జరిపిన అరాచకాలపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ ఎంపీ వి. శివదాసన్ కూడా రూల్ 267 కింద నోటీసు ఇచ్చారు.

**'రామ మందిర దోపిడీ'**

అయోధ్యలోని రామ మందిర దోపిడీపై కేంద్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ముందుకొచ్చాయి. 'విరాళాలకు సమాధానం చెప్పాలి' అంటూ పార్లమెంట్ గేటు వద్ద బ్యానర్ ప్రదర్శిస్తూ ప్రతిపక్షాలు నిరసన తెలిపాయి. 'అయోధ్యలో దోపిడీపై యూపీ ప్రభుత్వ విచారణ కేవలం ఒక బూటకం' అని డింపుల్ యాదవ్ స్పందించారు. లూటీపై సమాధానం చెప్పాలని కోరుతూ ఉభయ సభల సభ్యులు నినాదాలు చేశారు. రాబోయే రోజుల్లో ఈ లూటీకి వ్యతిరేకంగా పార్లమెంటులో నిరసనను తీవ్రతరం చేయాలని ఇండియా బ్లాక్ ఎంపీల సమావేశం నిర్ణయించింది. ఈ నిరసనలో ప్రియాంక గాంధీ, ఎస్పీ ధర్మేంద్ర యాదవ్, సీపీఐ(ఎం) ఎంపీలు జాన్ బ్రిట్టాస్, వి. శివదాసన్, ఎఎ రహీం, టీఎంసీకి చెందిన సాగరిక ఘోష్, జేఎంఎం మహువా, ఇతర ఎంపీలు కూడా పాల్గొన్నారు.

# అమిత్ షా మౌనం దేనికి?

(మొదటిపేజీ తరువాయి)

ఈ బిల్లును రాజ్యసభ ఆమోదం కోసం తీసుకొచ్చారు. విద్యార్థులు, యువత సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందనేందుకు ఈ బిల్లే నిదర్శనం అని మంత్రి జితేంద్ర సింగ్ పునరుద్ఘాటించారు. విద్యార్థుల ప్రయోజనాల్ని ఉన్నతంగా కాపాడేందుకు, వారి సంక్షేమానికి తమ ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లు అని ఆయన అన్నారు. పేపర్ల లీకులను తమ ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని, వీటిని సహించేది లేదని తెలిపారు. విద్యార్థులు, యువత భవిష్యత్తును ప్రమాదంలో పడేయబోమన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి పారదర్శకత కోసమే ఈ బిల్లు తెచ్చామన్నారు. దేశంలో యూపీఎస్సీ, ఆర్బీఐ, ఐబీపీఎస్, ఎన్‌టీఏ వంటి నాలుగు ప్రధానమైన నియామక, పరీక్షల నిర్వహణ సంస్థలు ఉన్నాయని చెప్పారు.

**విద్యార్థులకు జరిగిన నష్టాన్ని ఎవరు భర్తీ చేయాలి : ఖర్గే**

ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ వంటి దారుణ ఘటనకు అమిత్ షాదే బాధ్యత అని స్పష్టం చేశారు. దీనిపై ఇంతవరకూ ఆయన ఎలాంటి ప్రకటన చేయలేదంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఢిల్లీ ఘటనపై నోరు విప్పి మాట్లా డాలంటూ అమిత్ షాను ఖర్గే డిమాండ్ చేశారు. పేపర్ లీక్ వల్ల విద్యార్థులు నష్టపోవాలా? అని కేంద్రాన్ని నిలదీశారు. చాలామంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆవేదనను అర్థం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు జరిగిన నష్టాన్ని ఎవరు భర్తీ చేయాలి? అని ప్రభుత్వాన్ని ఖర్గే ప్రశ్నించారు. పేపర్ లీక్ అనేది తలదించుకోవాల్సిన అంశమని అన్నారు.

**'మోడీ, షాలకు విద్యార్థులు గుణపాఠం చెప్తారు'**

ఈ బిల్లును 2024లోనే ఎందుకు తీసుకురాలేదని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలుపు కోసం తపన తప్ప విద్యార్థులపై ప్రేమ లేదని కేంద్ర వైఖరిని తప్పుబట్టారు. బీహార్‌లో ఆందోళనకు దిగిన విద్యార్థులపై తుపాకులు ఎక్కుబెట్టారని విమర్శించారు. ఆందోళన చేసిన యువత ఉగ్రవాదులు కాదు కదా? అని కేంద్రానికి ఖర్గే చురకలంటించారు. పోలీసుల చర్యలపై ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మౌనాన్ని వీడాలని, లేదంటే మళ్లీ విద్యార్థులు గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

**పిల్లల భవిష్యత్తు పట్టని కేంద్రం.. రాజకీయాల పైనే దృష్టి**

బీజేపీ రాకీయాల వల్లే దేశంలో లీకులు, నిరసనలు, లాఠీఛార్జ్‌లు జరుగుతున్నట్టు ఖర్గే ఆరోపించారు. నిరసనకారులకు జరిగిన ప్రతి గాయానికి ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. కేంద్ర సర్కారు రాజకీయాల్లో నిమగ్నమైందని, కానీ పిల్లల భవిష్యత్తును విస్మరించిందన్నారు. నిరసనలను నియంత్రించేందుకు బిల్లు తెచ్చారని, కానీ విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం కాదని ఆయన ఆరోపించారు. విద్యా సంస్థలకు ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తులు నేతృత్వం వహిస్తున్నారని, వారిని తొలగించాలని డిమాండ్ చేశారు. స్కూళ్లు, యూనివర్సిటీల సిలబస్‌లో మార్పులు జరుగుతున్నాయని, మనుస్మృతి ప్రకారం ఆ మార్పులు చేస్తున్నట్టు ఖర్గే ఆరోపిం చారు. విద్యా వ్యవస్థలో కుల వివక్షను మనుస్మృతి ప్రోత్సహించినట్టు ఆరోపిం చారు. అయితే ఆ వ్యాఖ్యలను ట్రెజరీ సభ్యులు ఖండించారు. దీంతో సభలో కాసేపు గందరగోళం నెలకొన్నది. మనుస్మృతిపై ఖర్గే చేసిన వ్యాఖ్యలను రాజ్యసభ రికార్డుల నుంచి తొలగించాలని సభాపక్ష నేత జెపి నడ్డా కోరారు. రాజ్యసభ చైర్మెన్ సిపి రాధాకృష్ణన్ మాట్లాడుతూ... చర్చలో మనుస్మృతి ప్రస్తావన సంబంధం లేని అంశమని, అధికారిక రికార్డుల నుంచి ఆ వ్యాఖ్యలను తొలగిస్తున్నట్టు చెప్పారు.

**ప్రభుత్వం ఎందుకు భయపడుతోంది సంజయ్ రౌత్**

విద్యార్థుల నిరసనల పట్ల ప్రభుత్వం ఎందుకు అంతగా భయపడుతోందని శివసేన (థాక్రే) ఎంపీ సంజయ్ రౌత్ ప్రశ్నించారు. చాలా మంది పార్లమెంటు సభ్యులు తమ రాజకీయ ప్రస్థానాన్ని విద్యార్థి ఉద్యమాల నుంచే ప్రారంభించారని ఆయన గుర్తుచేశారు. "అలాంటప్పుడు ఇప్పుడు మనం వారిని చూసి ఎందుకు భయపడుతున్నాం?" అని ప్రశ్నించారు. "లాఠీలు, బాష్పవాయువు, పెల్లెట్లతో విద్యార్థులపై దాడులు జరుగుతుంటే కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎందుకు ఎలాంటి ప్రకటనా చేయలేదు?" అని ఆయన కేంద్రాన్ని నిలదీశారు.

**పారదర్శకత, జవాబుదారీతనం ముఖ్యం: మహువా మొయిత్రా**

ప్రశ్నపత్రం లీక్ చేసే ముఠాలకు శిక్షను పెంచే ఉద్దేశంతో 'పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు'ను ప్రవేశపెట్టిన ప్పటికీ, అది సరిపోదని జేఎంఎం ఎంపీ మహువా మాఝీ అన్నారు. నివారణ, పారదర్శకత, జవాబుదారీతనం అనేవి మరింత ముఖ్యమని ఆమె తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం ఫిన్లాండ్, సింగపూర్, దక్షిణ కొరియా వంటి దేశాలు తమ విద్యా విధానాలను ఎలా మార్చుకున్నాయో ప్రస్తావించారు. పేపర్ లీక్‌లను అరికట్టడానికి విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని, దానిని డిజిటలైజ్ చేయాలని సూచించారు.

**ఎన్‌టీఏను రద్దు చేయాలి : మనోజ్ కుమార్ ఝా**

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని రద్దు చేయాలని ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా డిమాండ్ చేశారు. పేపర్ లీక్ సమస్యను నివారణ దశ నుంచి పూర్తిగా నిర్మూలించే దశకు తీసుకువెళ్లలేకపోతున్నామని అన్నారు. సోషల్ మీడియాలో వీడియోలు చేయడం లేదా యువత (జెన్ జీ) మాట్లాడే భాషను అనుకరించడం వారికి అవసరం లేదని, తమ సమస్యలను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని వారు కోరుకుంటున్నారని అన్నారు. ఈసారి ఒక మంత్రి పదవి పోతే, వచ్చేసారి మొత్తం ప్రభుత్వమే కూలిపోతుందని హెచ్చరించారు. 53-54 ఏండ్ల వయసులో గెట్ అభ్యర్థులు మళ్లీ పరీక్ష రాయాల్సి రావడం గురించి విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరితో జరిగిన సంభాషణను ఆయన గుర్తు చేశారు. కానీ, ఎలాంటి పరీక్షలు రాయకుండానే వైస్-ఛాన్సలర్లు విశ్వవిద్యా లయాలకు నాయ కత్వం వహిస్తున్నారని ఆయన ఎత్తిచూపారు.

**ప్రభుత్వం ఉగ్రవాదుల్లా వ్యవహరించింది: సంజయ్ సింగ్**

గత పదేండ్లలో ఆత్మహత్యలు చేసుకున్న 1.23 లక్షల మంది విద్యార్థులకు నివాళులు అర్పించడంతో తన ప్రసంగాన్ని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ప్రారంభించారు. ఫాస్ట్-ట్రాక్ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసుల భారాన్ని, అలాగే విద్య, పాఠశాలల్లో వసతుల కొరతను ప్రస్తావించారు. "భారత్ నిరక్షరాస్య దేశంగా మారినప్పుడే, అది 'అంధభక్తుల' (విచక్షణ లేని అనుచరుల) దేశంగా మారుతుంది" అని సంజయ్ సింగ్ అన్నారు. ఢిల్లీ, బీహార్‌లలో విద్యార్థుల నిరసనల సమయంలో ప్రయోగించిన అధిక బలప్రయోగంపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. "బీహార్‌లో పోలీసులు విద్యార్థులపై ఏకే-47తో కాల్పులు జరిపారు. ప్రభుత్వం ఉగ్రవాదుల మాదిరిగా వ్యవహరించింది" అని విమర్శించారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో పరీక్షలు నిర్వహించి, ఆ మూడు రాష్ట్రాల్లోనూ 'బ్లాక్‌లిస్ట్' చేయబడిన ఎడ్యుటెస్ట్ సంస్థపై ప్రశ్నలు లేవనెత్తారు. ప్రభుత్వం చూపిన పక్షపాతం కారణంగానే ఆ సంస్థకు పరీక్షల నిర్వహణ కాంట్రాక్టులు లభిస్తూ వచ్చాయని ఆయన ఆరోపించారు.

## అమిత్ షా
# రాజీనామా చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. నీట్ పేపర్ లీక్‌పై నెల పాటు సీజేపీ సాగించిన ఆందోళనల అనంతరం ఛత్రపతి శంభాజీనగర్‌లోని తన నివాసానికి తిరిగివచ్చిన దీప్కే విలేకర్లతో మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడంలో వ్యవస్థలు కూడా విఫలమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన డిమాండ్‌కు ఆయన మద్దతిచ్చారు. విద్యార్థులపై పోలీసుల చర్యకు ఆదేశాలు జారీ చేయగలిగింది అమిత్ షానే నని, అందుకు ఆయన కచ్చితంగా రాజీనామా చేయాల్సిందేనన్నారు. సీజేపీకి బయట నుంచి నిధులు అందుతున్నాయని, బయటి వారు ఆ ఉద్యమాన్ని నడుపుతున్నారంటూ వినిపిస్తున్న వార్తలను తీవ్రంగా తప్పు పట్టారు.

**ప్రజలంతా ఏకతాటిపైకి రావాలి**

ప్రజాస్వామ్యాన్ని కాపాడడమనేది కేవలం ప్రతిపక్షాలకు సంబంధించిన అంశమే కాదని, ఇప్పుడు దాన్ని కాపాడేందుకు దేశ ప్రజలు ఒక్క తాటిపైకి రావాలని దీప్కే అన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రస్తావిస్తూ, రాజకీయ ప్రయోజనాల కోసం వాటిని ఉపయోగిస్తున్నారని తెలిపారు. శివసేన, ఎన్సీపీ వంటి పార్టీలను చీల్చడానికి ఈడీ, సీబీఐలను ఎలా ఉపయోగించారో మనందరం చూశామన్నారు. అధికారంలో ఉన్న వారు ఒక వ్యక్తి నియంతృత్వాన్ని నిలువరించలేనప్పుడు కేవలం ప్రతిపక్షాలే కాదు, దేశ ప్రజలందరూ ఒక తాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించి.. ఆ స్థానంలో మరో వింత మనిషిని కూర్చోబెట్టి దేశానికి ఏ రకమైన సందేశం ఇస్తున్నారని దీప్కే ప్రశ్నించారు. జంతర్ మంతర్ వద్ద నిరసనల ద్వారా దేశ సంస్కృతిని జెన్ జీ అపఖ్యాతి పాల్జేశారని యోగా గురు రామ్‌దేవ్ చేసిన విమర్శపై స్పందిస్తూ... రాజ్యాంగ పరిధిలోనే ఆ ఆందోళన సాగిందని స్పష్టం చేశారు. పతంజలి గురించి రామ్‌దేవ్ ఆలోచిస్తే మంచిదని వ్యాఖ్యానించారు.

**రైతాంగ పోరాటాలకు అండగా ఉంటాం**

రైతాంగ పోరాటాలకు అభిజీత్ దీప్కే మద్దతును ప్రకటించారు. అవసరమైనపుడు వారికి సీజేపీ అండగా నిలబడుతుందన్నారు. గతంలో తమ ఆందోళనలకు వారు మద్దతిచ్చారని, ఒకవేళ వారికి ఇప్పుడు తమ మద్దతు అవసరమైతే కచ్చితంగా అండగా నిలబడతామని చెప్పారు. ఈ దేశంలో పోలీసులు రాజ్యాంగాన్ని అనుసరిం చాలని, అంతేకానీ రాజకీయ ఆదేశాలను కాదని వ్యాఖ్యానించారు. వారు ఒక పార్టీకి చెందినవారు కాదని, దేశానికి చెందినవారని అన్నారు.

## 2034 వరకు
# సీఎంగా కొనసాగుతా..

(మొదటిపేజీ తరువాయి)

సంఘాలు ప్రభుత్వంతో నిర్మొహమాటంగా చర్చించాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలలో చదివిన తాను ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నానని గుర్తుచేసిన రేవంత్ రెడ్డి, 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని ధీమా వ్యక్తం చేశారు. ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించడాన్ని ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుంటోందని తెలిపారు. విద్యా వ్యవస్థలో నిర్ణయాలు పైస్థాయి నుంచి కాకుండా కింది స్థాయి నుంచి రావాలని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రతి మండలంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అవసరమైన సూచనలు ఉపాధ్యాయులే ఇవ్వాలని, వాటిని అధికారులు అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివితే మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయనే విశ్వాసాన్ని విద్యార్థుల్లో పెంచాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

## ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల
# ఎంపిక ఆంధ్రప్రదేశ్

(మొదటిపేజీ తరువాయి)

లిమిటెడ్ (టీపీఆర్ఈఎల్) ఆధ్వర్యంలో రూ.5,350 కోట్లతో అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఏర్పాటు చేయనున్న 800 మెగావాట్ల క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు గురువారం మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, గత ఏడాదితో పోలిస్తే ఈ ఒక్క ఏడాదిలోనే ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 400 శాతం పెరిగిందని, రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న విశ్వసనీయత వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు.

**పెట్టుబడిదారుల్లో నమ్మకం పెంపొందించాం**

"రాష్ట్రంలో 2024 జూన్ లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు, పునరుత్పాదక ఇంధన రంగం పూర్తిగా అస్తవ్యస్తంగా ఉండేది. అంతకుముందు ఐదేళ్లలో కనీసం ఒక్క మెగావాట్ సామర్థ్యం గల ప్రధాన రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు కూడా ప్రారంభించలేదు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేశారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం దెబ్బతింది. ప్రపంచంలోని అనేక అతిపెద్ద ఇన్‌ఫ్రా, క్లైమేట్ ఫండ్స్ ఆంధ్రప్రదేశ్‌ను బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాయి. ఒకసారి దెబ్బతిన్న విశ్వాసాన్ని పునరుద్ధరించడం రాత్రికి రాత్రే సాధ్యంకాదు. పెట్టుబడిదారుల్లో మళ్లీ నమ్మకాన్ని పెంపొందిస్తూ వచ్చాం" అని పేర్కొన్నారు.

**ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీతో తొలిఅడుగు**

ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ - 2024ను ప్రవేశపెట్టి విస్తృతమైన విజన్‌తో 160 గిగావాట్ల క్లీన్ ఎనర్జీ సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని అన్నారు. సోలార్ మాడ్యూల్స్, సెల్స్ నుండి బ్యాటరీలు, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, ట్రాన్స్‌మిషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, పోర్ట్స్, స్టోరేజీ సిస్టమ్స్.. ప్రపంచ స్థాయి తయారీ వరకు - మొత్తం క్లీన్ ఎనర్జీ సప్లయ్ చైన్ ను ఆంధ్రప్రదేశ్ లో నిర్మించాలని అనుకున్నామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఇంధనాన్ని వినియోగించు కోవడమే కాకుండా, క్లీన్ ఎనర్జీ టెక్నాలజీలకు గ్లోబల్ ప్రొడ్యూసర్ గా మారాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని లోకేష్ తెలిపారు.

**దేశానికి నాయకత్వం వహించే ఏపీని నిర్మిద్దాం**

'టాటా' అనే పేరు ఎల్లప్పుడూ నమ్మకం, నిజాయితీ, దేశ నిర్మాణం, ఆవిష్కరణలకు మారుపేరుగా నిలిచిందని లోకేష్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో టాటా బంధం చాలా బలీయమైనదని అన్నారు. ప్రభుత్వం, పారిశ్రామిక రంగం, రైతులు, ప్రజలు కలిసి క్లీన్ ఎనర్జీ, పరస్పర విశ్వాసం, భాగస్వామ్య స్ఫూర్తితో కూడిన సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తున్నామని అన్నారు. భారతదేశానికి దిశానిర్దేశం చేసే ఆంధ్రప్రదేశ్‌ను, స్వచ్ఛ ఇంధన రంగంలో ప్రపంచానికే నాయకత్వం వహించే భారతదేశాన్ని మనం కలిసి నిర్మిద్దామని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టాటా పవర్ సిఇఓ & ఎండి ప్రవీర్ సిన్హా, టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీ సిఇఓ & ఎండి సంజయ్ బంగా, సుజలాన్ వైస్ చైర్మన్ గిరీష్ తంతి, భారీ పరిశ్రమల మంత్రి టిజి భరత్, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, కె.ఇ. శ్యామ్ బాబు, జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి, టాటా పవర్, సుజ్లాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# ఉద్యోగులలో ఎఫర్ట్ రిసెషన్



ముఖ్యంగా యువ ఉద్యోగులు పనిపై తమ దృక్పథాన్ని మార్చుకుంటుండగా, కృత్రిమ మేధస్సు ఉద్యోగ ప్రపంచాన్ని వేగంగా ప్రభావితం చేస్తోంది. గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇండియా 2026 తాజా అధ్యయనం ప్రకారం భారతీయ సంస్థల్లో 'ఎఫర్ట్ రిసెషన్ అనే కొత్త ధోరణి కనిపిస్తోంది. అంటే ఉద్యోగులు తమ విధుల్లో భాగం కాని అదనపు బాధ్యతలు స్వచ్ఛందంగా తీసుకోవడానికి ఆసక్తి చూపడం తగ్గుతోందని నివేదిక వెల్లడించింది. దేశవ్యాప్తంగా సర్వే చేసిన 380 సంస్థల్లో 240 సంస్థలు (63శాతం), గత ఏడాదితో పోలిస్తే ఉద్యోగుల అదనపు కృషి తగ్గిందని తెలిపాయి. సగటున ఈ తగ్గుదల 5 శాతంగా నమోదైంది. నివేదిక ప్రకారం, ఉద్యోగులు ఎవరూ చెప్పకుండానే ఆలస్యంగా పనిచేయడం, తమ బాధ్యతలకు అతీతంగా సమస్యలను పరిష్కరించడం, స్వచ్ఛందంగా అదనపు బాధ్యతలు స్వీకరించడం వంటి అంశాలనే 'డిస్క్రెషనరీ ఎఫర్ట్'గా నిర్వచించారు.

ప్రస్తుతం భారత ఉద్యోగుల్లో జెన్ జీవాటా 26 శాతానికి చేరుకుంది. ఇది 2023తో పోలిస్తే దాదాపు రెండింతలు. ఈ తరం ఉద్యోగులు ఎక్కువ గంటలు పనిచేయడం కంటే పని-వ్యక్తిగత జీవితం సమతుల్యత, అనువైన పని విధానం, నిరంతర నైపుణ్యాభివృద్ధి, కెరీర్ పురోగతి, అర్థవంతమైన పని, మానసిక ఆరోగ్యం వంటి అంశాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అధ్యయనం పేర్కొంది. అదే సమయంలో ఎఐ ప్రభావంతో ఉత్పాదకతను కొలిచే విధానంలో కూడా మార్పులు వస్తున్నాయి. అయితే తాజా నివేదిక ప్రకారం ఉద్యోగుల అదనపు కృషి తగ్గుదల అన్ని రంగాల్లో ఒకేలా ఉండటం లేదు. రిటైల్ రంగంలో 88%, ఐటీ మరియు ప్రొఫెషనల్ సర్వీసెస్‌లో 77%, నిర్మాణం, రియల్ ఎస్టేట్‌లో 71%తయారీ (మాన్యుఫ్యాక్చరింగ్)లో కేవలం 44% తగ్గుదల నమోదైందని తెలిపాయి. ఉద్యోగులు తమ నాయకులు తమ సంక్షేమాన్ని నిజంగా పట్టించుకుంటున్నారని భావిస్తే 99 శాతం మంది అదనపు కృషి చేయడానికి సిద్ధంగా ఉంటారని అధ్యయనం తెలిపింది. అదే నాయకత్వంపై నమ్మకం లేకపోతే ఈ సంఖ్య 29 శాతానికి పడిపోతోంది.

అలాగే నాయకులు స్ఫూర్తినిచ్చే విధంగా ఉంటే 98 శాతం మంది ఉద్యోగులు అదనపు బాధ్యతలు తీసుకుంటారని, అలాంటి నాయకత్వం లేకపోతే ఈ సంఖ్య 32 శాతానికి మాత్రమే పరిమితమవుతుందని నివేదిక వెల్లడించింది. ఉద్యోగులు తమ నాయకులు తమ సంక్షేమాన్ని నిజంగా పట్టించుకుంటున్నారని భావిస్తే 99 శాతం మంది అదనపు కృషి చేయడానికి సిద్ధంగా ఉంటారని అధ్యయనం తెలిపింది. అదే నాయకత్వంపై నమ్మకం లేకపోతే ఈ సంఖ్య 29 శాతానికి పడిపోతోంది. అలాగే నాయకులు స్ఫూర్తినిచ్చే విధంగా ఉంటే 98 శాతం మంది ఉద్యోగులు అదనపు బాధ్యతలు తీసుకుంటారని, అలాంటి నాయకత్వం లేకపోతే ఈ సంఖ్య 32 శాతానికి మాత్రమే పరిమితమవుతుందని నివేదిక వెల్లడించింది. దట్ కల్చర్ థింగ్ సంస్థకు చెందిన ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్ గుర్లీన్ బరువా అభిప్రాయం ప్రకారం ఇది పని పట్ల నిబద్ధత తగ్గిపోవడం కాదని, పనిని చూసే విధానం మారుతున్న సంకేతమని పేర్కొన్నారు. పని పట్ల నిబద్ధత అంటే కేవలం ఎక్కువ గంటలు పనిచేయడం లేదా ఎప్పుడూ బిజీగా కనిపించడం మాత్రమే కాదు. సమస్యలను సమర్థంగా పరిష్కరించడం, నాణ్యమైన ఫలితాలు ఇవ్వడం, బృందంతో సమన్వయంగా పనిచేయడం కూడా నిజమైన వర్క్ ఎథిక్‌లో భాగమే అని ఆమె చెప్పారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఏ కారణంగా ఉద్యోగాల స్వరూపం మారుతోంది. ముఖ్యంగా ప్రారంభ స్థాయి ఉద్యోగాల్లో గంటల కొద్దీ పనిచేయడం కంటే సృజనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యం, సాంకేతికతను సమర్థంగా వినియోగించడం కీలకంగా మారుతోంది. అలాగే వర్క్ ఫ్రం హోమ్, హైబ్రిడ్ వర్క్, మానసిక ఆరోగ్యంపై పెరుగుతున్న అవగాహన కారణంగా ఉద్యోగులు తమ వ్యక్తిగత సమయానికి ఎక్కువ విలువ ఇస్తున్నారు. నేటి ఉద్యోగులు అదనపు కృషి చేయడానికి సిద్ధంగానే ఉన్నప్పటికీ, ఆ కృషికి స్పష్టమైన ఉద్దేశం, గుర్తింపు, విశ్వాసం, అర్థవంతమైన పని ఉంటేనే ముందుకు వస్తున్నారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## మారని ఆ 15 మంది..

# మూసధోరణిలోనే తెలుగు తమ్ముళ్లు

**విజయవాడ - సూర్య వాస్తవం**




తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి రాజకీయ వ్యూహాలు ఎల్లప్పుడూ అత్యంత పదునుగా ఉంటాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలోనే ఎమ్మెల్యేల పనితీరు, అవినీతి ఆరోపణలు, నియోజకవర్గాల్లో అసమ్మతి గ్రూపులు వంటి వ్యవహారాల్లో పడి ప్రజలకు దూరమవుతున్న దాదాపు 40 మంది ఎమ్మెల్యేలకు ఆయన గట్టి హెచ్చరికలే జారీ చేశారు. బాబు హెచ్చరికలతో ఆ 40 మందిలో దాదాపు 25 మందికి పైగా వెంటనే అలర్ట్ అయి, తమ తీరు మార్చుకుని దారికి వచ్చారు. అయితే, మిగిలిన ఆ 15 మంది మాత్రం ఇంకా పాత ధోరణినే కొనసాగిస్తూ నాయకత్వానికి మింగుడుపడని సవాలుగా మారారు. కానీ, ఈ 'బ్లాక్ లిస్ట్'లో ఉన్న మిగిలిన 15 మంది ఎమ్మెల్యేల విషయంలో చంద్రబాబు అనుసరిస్తున్న నూతన వ్యూహం ఇప్పుడు ఏపీ రాజకీయంలో ఆసక్తికరంగా మారింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తున్నారని నేరుగా సస్పెండ్ చేస్తే.. సామాజిక వర్గాల కార్డులు లేదా సానుభూతి రాజకీయాలు తెరపైకి వస్తాయి. పైగా నియోజకవర్గాల్లో అనవసరంగా రచ్చ జరుగుతుంది. సరిగ్గా ఈ సమయంలో కాగల కార్యాన్ని గాంధర్వులే తీర్చినట్లు .. టీడీపీ వదిలించుకోవాలని భావిస్తున్న ఆ అసంతృప్త నేతలను ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీ మెల్లగా తమవైపు ఆకర్షించేలా పరిణామాలు జరిగిపోతున్నాయి. ఇక్కడే ఒక పెద్ద పొలిటికల్ సస్పెన్స్ దాగి ఉంది. అసలు ఆ ఎమ్మెల్యేలను వైసీపీనే ఆకర్షిస్తోందా? లేక అధిష్ఠానమే తెలివిగా, వ్యూహాత్మకంగా వారిని ఆ వైపునకు తోలేస్తోందా? అనేది సాధారణ రాజకీయ పరిశీలకులకు కూడా అర్థం కానంత నిశ్శబ్దంగా జరుగుతోంది. నియోజకవర్గాల్లో వారికి ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని ప్రోత్సహించడం, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రాధాన్యత తగ్గించడం, వినతులు పట్టించుకోకపోవడం ద్వారా.. మీకు ఇక్కడ భవిష్యత్తు లేదు అనే స్పష్టమైన సంకేతాన్ని పార్టీ పంపుతోంది.

దీంతో దిక్కుతోచని ఆ నేతలు సహజంగానే తమ రాజకీయ ఉనికి కోసం వైసీపీ లేదా ఇతర మార్గాల వైపు చూసే పరిస్థితి ఏర్పడుతోంది. ఒకవేళ ఈ ఎమ్మెల్యేలు స్వయంగా టీడీపీని వీడి వైసీపీ కండువా కప్పుకుంటే, అది చంద్ర బాబుకు రెండు రకాలుగా లాభిస్తుంది. మొదటిది.. నియోజకవర్గాల్లో పనిచేయని, ఆరోపణలు ఎదు ర్కొంటున్న నేతల భారం పార్టీపై నుంచి దానంతటదే తొలగిపోతుంది. రెండోది.. రాబోయే ఎన్నికల్లో కొత్త రక్తానికి, కష్టపడే క్యాడర్‌కు టికెట్లు కేటాయించడానికి అధిష్ఠానానికి సంపూర్ణ క్లియరెన్స్ దక్కుతుంది.

అనవసర వివాదాలకు తావివ్వకుండా, నేరుగా పోటు పొడవకుండా.. వదిలించుకోవాలనుకున్న వారిని స్వయంగా బయటకు వెళ్లేలా పరిస్థితులు కల్పించడమే చంద్రబాబు మార్క్ రివర్స్ సైకాలజీ అని పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ విశ్లేషిస్తున్నారు. పార్టీ క్రమశిక్షణను కాపాడు కుంటూనే, వ్యర్థాలను బయటకు నెట్టేసే ఈ నిశ్శబ్ద వ్యూ హం చాలా మందికి ఇంకా అర్థం కావడం లేదు.

# బీజేపికి పీకే భయం



**పాట్నా - సూర్య వాస్తవం**

ఎన్నికల వ్యూహకర్తగా ప్రశాంత్ కిషోర్ కు పేరు ఉంది. కష్ట సమయాలలో వ్యూహాలు రచించి వాటిని అమలు చేసే వ్యక్తిగా ఆయన అందరికీ సుపరిచితుడే. ప్రశాంత్ కిషోర్ ఎన్నికల వ్యూహకర్త ఉద్యోగాన్ని పక్కన పెట్టి.. బీహార్ ఎన్నికల్లో పోటీ చేశారు. అయితే ఆయనకు ఒక్క సీట్ కూడా రాలేదు. కనీసం చెప్పుకోదగిన స్థాయిలో ఓట్లు కూడా రాలేదు. దీంతో ప్రశాంత్ కిషోర్ స్ట్రాటజీ కేవలం కొంత పరిధికి మాత్రమే పరిమితం తేలిపోయిందిప్రశాంత్ కిషోర్ ప్రస్తుతం కొన్ని రాజకీయ పార్టీలకు పనిచేస్తున్నారు. సైలెంట్ గా వర్క్ మొదలుపెట్టారు. అయితే ప్రశాంత్ కిషోర్ గురించి ఇప్పుడు మరోసారి జాతీయ మీడియాలో చర్చ మొదలైంది.. ముఖ్యంగా బీహార్ రాష్ట్రంలో అధికార భారతీయ జనతా పార్టీకి ప్రశాంత్ కిషోర్ వ్యవహార శైలి పంటి కింద రాయిలాగా మారింది. బీహార్ లోని బంకిపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రస్తుతం ఉపయోగ జరుగుతుంది. ఈ నియోజకవర్గ భారతీయ జనతా పార్టీకి కంచుకోట లాగా ఉంది. ఈ నియోజకవర్గంలో పోటీ చేసిన నితిన్ నబీన్ రాజ్యసభకు వెళ్లిపోయారు. ఆయన భారతీయ జనతా పార్టీకి జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. దీంతో ఈ నియోజకవర్గంలో ఉప ఎన్నిక వచ్చింది. ఈ నియోజకవర్గంలో జరిగే ఉప ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ పోటీ చేస్తున్నారు. ఎలాగైనా ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టాలని బలంగా నిర్ణయించుకున్నారు. ప్రచారాన్ని కూడా ముమ్మరంగా మొదలుపెట్టారు. ఈ నియోజకవర్గంలో నిశ్శబ్ద ఓటర్లను ప్రశాంత్ కిషోర్ నమ్ముకున్నారు. యువతను కూడా ఆకర్షిస్తున్నారు. నీట్ పేపర్ లీకేజీ గురించి పదే పదే ప్రస్తావిస్తున్నారు. ప్రజల్లో ఉన్న నిశ్శబ్దమైన ఆగ్రహాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవాలని ప్రశాంత్ కిషోర్ గట్టి పట్టుదలతో ఉన్నారు. ఈ ఉప ఎన్నికను భారతీయ జనతా పార్టీ ఏమాత్రం సులభంగా తీసుకోవడం లేదు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ సొంత సెగ్మెంట్ కావడంతో.. బిజెపి ఇక్కడ ఎలాగైనా గెలవాలని భావిస్తుంది. పైగా ఇక్కడ నీరజ్ కుమార్ అనే యువ నాయకుడిని పోటీలో పెట్టింది. కేవలం నితిన్ మాత్రమే కాకుండా బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి.. కీలక నాయకులు రవిశంకర్ ప్రసాద్.. మనోజ్ తివారి.. పవన్ సింగ్.. చిరాగ్ పాశ్వాన్ వంటి వారంతా ఎన్నికల ప్రచారంలో ముందు వరుసలో ఉన్నారు. వీరంతా కూడా బిజెపి అభ్యర్థి కోసం గట్టిగా కృషి చేస్తున్నారు. అటు ప్రశాంత్ కిషోర్.. ఇటు నీరజ్ మధ్య భీకరమైన పోటీ ఉన్న నేపథ్యంలో బీహార్లో ప్రధాన ప్రతిపక్షం రాష్ట్రీయ జనతాదళ్ కూడా రంగంలోకి దిగింది. పటిష్టమైన వ్యూహాలను అమలు చేస్తోంది. ఇక్కడ ఆర్జెడి అభ్యర్థిగా రేఖ గుప్త పోటీలో ఉన్నారు. ఆమె ప్రజల సమస్యలను పదే పదే ప్రస్తావిస్తున్నారు. డ్రైనేజీ సమస్య.. రోడ్ల దుస్థితి.. మౌలిక వసతులు లేకపోవడం.. నిరుద్యోగం వంటి సమస్యలను పదేపదే ప్రస్తావిస్తున్నారు. రేఖ తరఫున తేజస్వి యాదవ్ ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ విధానాల మీద తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఒకవేళ ప్రశాంత్ కిషోర్ భారతీయ జనతా పార్టీ వైపు ఉండే ఓటర్లను తన వైపు తిప్పుకోగలిగితే.. తమకు ప్రయోజనం లభిస్తుందని ఆర్జెడి భావిస్తోంది. పాట్నాకు దగ్గరగా ఉండే బాంకి పూర్ నియోజకవర్గాన్ని మామూలుగా చూడకూడదు. ఇది ప్రశాంత్ కిషోర్ రాజకీయ అస్థిత్వానికి.. బిజెపి జాతీయ అధ్యక్షుడి పరువుకి.. తేజస్వి యాదవ్ రాజకీయ భవితవ్యానికి సంబంధించింది.. అందువల్లే ఈ నియోజకవర్గంలో ఉప ఎన్నిక జాతీయస్థాయిని ఆకర్షిస్తోంది.

# తెరపైకి ఎండ్రిన్ పార్టీ

**హైదరాబాద్ - సూర్య వాస్తవం**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమ స్ఫూర్తి తెలంగాణ నిరుద్యోగ యువతను తట్టిలేపుతోంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి, రాజకీయ హామీల ఉల్లంఘనకు నిరసనగా తెలంగాణ నిరుద్యోగ జేఏసీ, పోలీస్ జేఏసీ నేతలు ఏకమై 'తెలంగాణ ఎండ్రిన్ పార్టీ' పేరుతో కొత్త రాజకీయ వేదికను ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ సమస్యల సమగ్ర పరిష్కారమే అజెండాగా రూపుదిద్దుకున్న ఈ నిర్ణయం, ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ఈ సంచలనాత్మక నిర్ణయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వివాదాస్పద వ్యాఖ్యలే ప్రధాన కారణమని నిరుద్యోగ నాయకులు స్పష్టం చేశారు. "మీరు ఒర్లినా, పొర్లుదండాలు పెట్టినా.. ఎండ్రిన్ తాగి బావిలో దూకినా పోలీస్ ఉద్యోగాలు పెంచడం సాధ్యం కాదు" అంటూ సీఎం చేసిన కామెంట్స్ నిరుద్యోగుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రగిల్చాయి. దశాబ్దాలుగా ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న యువత ఆవేదనను ఎద్దేవా చేసేలా ఉన్న ఈ వ్యాఖ్యలకు నిరసనగానే, ఆ పదాలనే ప్రత్యర్థులపై వ్యంగ్యాస్త్రంగా మలచి 'తెలంగాణ ఎండ్రిన్ పార్టీ'కి పురుడుపోశారు. ప్రజాస్వామ్యయుతంగా తమ గొంతును చట్టసభలు, రాజకీయ వేదికలపై వినిపించడమే ఈ నూతన వేదిక లక్ష్యమని ప్రతినిధులు వెల్లడించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందు పలు డిమాండ్లను కూడా పెట్టారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏటా పారదర్శకంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, నిర్దేశిత గడువులోగా నియామక ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన యువత కోసం 20 వేల పోలీస్ కానిస్టేబుల్ పోస్టులతో కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. వెంటనే మెగా డీఎస్సీ నిర్వహించి టీచర్ పోస్టులను నింపాలన్నారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్ -3, గ్రూప్-4 నియామక ప్రక్రియను ఎలాంటి చట్టపరమైన అడ్డంకులు లేకుండా పారదర్శకంగా వేగవంతం చేయాని డిమాండ్ చేశారు. పార్టీ నమోదు ప్రక్రియను వారం రోజుల్లో కేంద్ర ఎన్నికల కమిషన్ వద్ద పూ ర్తి చేస్తామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. అనంతరం తెలంగాణ ఉద్యమాల పురిటిగడ్డ అయిన ఉమ్మడి నల్గొండ జిల్లా సూర్యాపేటలో భారీ ఆవిర్భావ సభను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. విప్లవ పోరాటాల ప్రతీక మారోజు వీరన్న స్థూపం వద్ద తెలంగాణ ఎండ్రిన్ పార్టీ అధికారిక లోగోను ఆవిష్కరించి తొలి బహిరంగ సభ ద్వారా తమ బలాన్ని చాటుకోనున్నారు. ఇక్కడ ప్రధానంగా ప్రస్తావించాల్సిన రాజకీయం మరొకటి ఉంది. జాతీయ స్థాయిలో వెలిసిన కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగా పూర్తి మద్దతు పలికారు. యువత భాగస్వామ్యాన్ని పెంచేందుకు 21 ఏళ్లకే చట్టసభల్లోకి అడుగుపెట్టేలా వయోపరిమితిని సడలించాలని కాంగ్రెస్ గళమెత్తి సర్వత్రా ప్రశంసలు అందుకుంది. కానీ, సొంత రాష్ట్రంలో గత 50 రోజులుగా నిరుద్యోగులు రోడ్డెక్కి పోరాడుతున్నా, వారి సమస్యలను పట్టించుకోకపోవడంపై జేఏసీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ స్థాయిలో ప్రజాస్వామ్య హక్కులు మాట్లాడే కాంగ్రెస్, స్థానికంగా నిరుద్యోగుల ఆవేదనను తృణీకరించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శిస్తున్నారుకాక్రోచ్ జనతా పార్టీ బాటలోనే 'తెలంగాణ ఎండ్రిన్ పార్టీ' ఆవిర్భవించడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఊహించని పెద్ద రాజకీయ తలనొప్పిగా మారింది. నిరుద్యోగుల తిరుగుబాటు కేవలం సోషల్ మీడియాకే పరిమితం కాకుండా, ఎన్నికల క్షేత్రంలో ఓటు బ్యాంకును శాసించే స్థాయికి చేరితే అది అధికార కాంగ్రెస్‌కు సవాలుగా మారడం ఖాయం. ఇప్పటికైనా రేవంత్ ప్రభుత్వం మొండివైఖరి వీడి నిరుద్యోగుల సమగ్ర డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే, రాబోయే రోజుల్లో ఈ 'ఎండ్రిన్' ఉద్యమ సెగలు రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉద్ధృతం కావడం ఖాయంగా కనిపిస్తోంది.



# రెండేళ్ల పాలన విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి..

- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- ప్రతి రోజు ఒక్కో బూత్ పరిధిలో 30 కుటుంబాలను కలవాలి
- ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించాలి



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అనంతపురం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలతో రూపొందించిన ప్రత్యేక పాంప్లెట్‌ను అనంతపురం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నియోజకవర్గ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ఫలితాలను ప్రజలకు స్పష్టంగా వివరించాలని నాయ కులు, కార్యకర్తలకు సూచించారు. 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజు ఒక్కో పోలింగ్ బూత్ పరిధిలో కనీసం 30 కుటుంబాలను కలవాలని తెలిపారు. ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించడంతో పాటు వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

# అండర్-14 క్రీడా పోటీలను విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్
- క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి
- ప్రతిభావంతులైన క్రీడాకారులకు తగిన అవకాశాలు కల్పించాలి



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** అనంతపురం స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్--2026లో భాగంగా నిర్వహించనున్న అండర్-14 బాల, బాలికల క్రీడా పోటీల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఆగస్టు 17, 18 తేదీలలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న అండర్-14 బాల, బాలికల క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. క్రీడా పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోటీల నిర్వహణలో క్రమశిక్షణ, పారదర్శకత పాటిస్తూ ప్రతిభావంతులైన క్రీడాకారులకు తగిన అవకాశాలు కల్పించాలని అధికారులకు తెలిపారు.

# ప్రజలకు పోలీసు వ్యవస్థపై మరింత నమ్మకం కల్పిస్తాం

- బాధితులకు త్వరితగతిన న్యాయం అందిస్తాం: డీఎస్పీ చంద్రశేఖర్
- నూతన డీఎస్పీగా ఎం.చంద్రశేఖర్ బాధ్యతల స్వీకరణ



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం నూతన డీఎస్పీగా ఎం.చంద్ర శేఖర్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. మంగళ గిరి నుంచి బదిలీపై వచ్చిన ఆయన స్థానిక పోలీసు సబ్‌డివిజన్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాంతిభద్రతల పరి రక్షణతో పాటు నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడమే లక్ష్యంగా పని చేస్తామని పేర్కొన్నారు. ప్రజలకు పోలీసు వ్యవస్థపై మరింత నమ్మకం కలిగేలా సేవలు అందిస్తామని స్పష్టం చేశారు.అనుభవజ్ఞుడైన అధికారి నూతన డీఎస్పీ ఎం. చంద్రశేఖర్ 1995 బ్యాచ్‌కు చెందిన అధికారి. అంతకుముందు 1992 నుంచి 1995 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో ఉద్యోగిగా సేవలు అందించారు. అనంతరం ఎస్‌ఐగా ఎంపికై ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించారు. 2010లో సీఐగా పదోన్నతి పొందిన ఆయన, అనంతరం తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో శాంతిభద్రతల విభాగంతో పాటు సీఐడీ విభాగంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల డీఎస్పీగా పదోన్నతి పొందిన చంద్రశేఖర్, మంగళగిరి నుంచి అనంతపురానికి బదిలీపై వచ్చి నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు.

# వచ్చే ఎన్నికల్లో ఆ 11 సీట్లు కూడా మిగలవు

- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- రానున్న రోజుల్లో వైఎస్సార్సీపీ నాయకులు మరింత గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటారు
- 33వ విడతలో 37 మందికి రూ.49.69 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**అనంతపురం అర్బన్ - సూర్య వాస్తవం :** ప్రజలకు మంచి చేయని వారు, ప్రభుత్వం ప్రజల కోసం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ఓర్వలేక అనవసర వివాదాలు సృష్టిస్తున్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శించారు. రానున్న రోజుల్లో వైసీపీ నాయకులు మరింత గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటారని, వచ్చే ఎన్నికల్లో ప్రస్తుతం ఉన్న 11 సీట్లు కూడా వారికి మిగలవని వ్యాఖ్యానించారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 33వ విడతలో 37 మంది లబ్ధిదారులకు రూ. 49.69 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇప్పటి వరకు 692 మంది లబ్ధిదారులకు రూ. 6.90 కోట్ల మేర ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. ఇందులో 450 మంది ముస్లిం మైనార్టీలు ఉండటం మైనార్టీల సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. గత ఐదేళ్ల పాలనలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఎంత మందికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సాయం అందించిందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలను తాము అమలు చేస్తుంటే, వాటిని ఓర్వలేక వైఎస్సార్సీపీ నాయకులు ఏదో ఒక వివాదాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో రూ. 3,500 కోట్ల మద్యం కుంభకోణం జరిగిందని ఆరోపిస్తూ, ఈ వ్యవహారంలో వరుసగా ఒక్కొక్కరు జైళ్లకు వెళ్తున్నారని వ్యాఖ్యానించారు. వైఎస్సార్సీపీ నాయకులు ఇలాగే కుట్రలు, కుతంత్రాలకు పాల్పడితే రాజకీయంగా మరింత పతనమవుతారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరించారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# డ్రైనేజ్ కాలువను ఏర్పాటు చేయండి

- రుద్రంపేట పంచాయతీ పరిధిలోని వికాస్ నగర్‌లో డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలంటున్న కాలనీ వాసులు
- వికాస్ నగర్‌లో డ్రైనేజీ కాలువలు లేక రోడ్లపైకి మురుగునీరు..!
- చిన్నారుల ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని స్థానికుల ఆందోళన..
- పంచాయతీ అధికారికి వినతి పత్రాన్ని అందించిన స్థానికులు





**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** రుద్రంపేట పంచాయతీ పరిధిలోని వికాస్ నగర్‌లో డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేసి, మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు సచివాలయం పంచాయతీ అధికారికి వినతి పత్రం అందించారు. వికాస్ నగర్‌లోని ఎస్.ఆర్.కే పాఠశాల సమీపంలోని ప్రధాన రహదారితో పాటు పలు వీధుల్లో సరైన మురుగునీటి కాలువలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు రోడ్లపైకి చేరుతోందని స్థానికులు వాపోతున్నారు. సీసీ రోడ్లు నిర్మించినప్పటికీ డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో రోడ్లపై నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని తెలిపారు. వర్షాలు కురిసిన సమయంలో వర్షపు నీరు కూడా బయటకు వెళ్లేందుకు సరైన మార్గం లేక రోడ్లపైనే నిలిచిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నిల్వ నీటి కారణంగా దోమల బెడద పెరిగి చిన్నారులు, వృద్ధులు ఆరోగ్య సమస్యలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, వికాస్ నగర్‌లో అవసరమైన డ్రైనేజీ కాలువలను త్వరితగతిన నిర్మించాలని స్థానికులు వినతిపత్రం ద్వారా కోరారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టి సమస్యకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.




# ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో బీమా ఎంతో అవసరం

- సకాలంలో ప్రీమియం చెల్లించి పథకంలో నమోదు కావాలి
- నేడే చివరి రోజు.. రైతులు ఆలస్యం చేయవద్దు
- జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఉమాదేవి పిలుపు



**అనంతపురం సిటీ - సూర్య వాస్తవం :** జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఉమాదేవి మాట్లాడుతూ, జిల్లాలోని ఉద్యానవన రైతులం దరికీ తన తరఫున ఒక చిన్న విన్నపం చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పంట బీమా పథకం కింద ఐదు ఉద్యానవన పంటలకు బీమా సౌకర్యం అందుబాటులో ఉందని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా ప్రీమియం చెల్లించాలని కోరారు. ఎండుమిర్చి పంటకు పంట బీమా సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు. అదే విధంగా వాతావరణ బీమా పథకం కింద దానిమ్మ, బత్తాయి, అరటి, టమాటా పంటలకు బీమా అమలవుతుందని పేర్కొన్నారు. వాతావరణ బీమా పథకంలో భాగంగా ఎకరాకు దానిమ్మకు రూ. 3,750, బత్తాయికి రూ. 2,750, అరటికి రూ. 3,000, టమాటాకు రూ. 1,600 చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నాయని, ఇప్పటివరకు పడాల్సిన స్థాయిలో వర్షాలు కురవలేదని ఉమాదేవి తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు పంటలకు రక్షణగా వాతావరణ బీమా పథకాన్ని తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రీమియం చెల్లించేందుకు ఈరోజే చివరి రోజు కావడంతో, అర్హులైన ఉద్యానవన రైతులందరూ ఆలస్యం చేయకుండా వెంటనే ప్రీమియం చెల్లించి బీమా పథకంలో నమోదు చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఉమాదేవి విజ్ఞప్తి చేశారు.

# అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

- గురుపౌర్ణమి సందర్భంగా గొప్ప ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శనలు



**పామిడి - సూర్య వాస్తవం:** పామిడి పెన్నానదిలోని శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయం ఆవరణంలో బుధవారం రాత్రి గురుపౌర్ణమి సందర్భంగా పీఠాధిపతి సనారీ వీరయ్యస్వామి ఆధ్వర్యంలో నిర్వహించగా పామిడి స్వరరాగ నాటక కళాసమితి ఉచితశిక్షణాలయం వారిచే గొప్ప ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహించగా చూపరులను ఎంతగానో అలరించాయి. నాటకంలో రాష్ట్రస్థాయి నటీనటులు, వారి గాన మాధుర్యం నటనా చాతూర్యముతో ప్రేక్షకులను ప్రేక్షకులను ఆనందింపజేశారు. నాటకప్రదర్శనలు వేకువ జాము వరకు ప్రేక్షకులు కళ్ళు ఆర్పకుండా చూసి తన్మయం చెందారు. ఎం దేవరాజు, విశ్వనాథ్, రమణలు సంగీతం ఆలపించగా, కూచిపూడి భరతనాట్యం, తదుపరి పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహించారు. పాన్పుసీనులో నారాయణరెడ్డి పరమేశ్వరరెడ్డి హనుమంతరెడ్డి, నటించగా మాయల మరాఠీగా పుంజా కృష్ణారావు, సంగు సుహాసిని,సత్యహరిశ్చంద్రుడుగా రాధాకృష్ణమనాయుడు, నక్షత్రకుడు నారాయణరెడ్డి లుగా వారి వారి గానమాధుర్యముతో నటనా చాతుర్యముతో రంగస్థలం వేదికపై నటిస్తున్నప్పుడు ప్రేక్షకుల నుంచి విజిల్ కేరింతలు చప్పట్లు కేకలుతో కళాభిమానులు ఉర్రూతలూగారు. ఈకార్యక్రమంలో పీఠాధిపతి సనారి వీరయ్య స్వామి, పంజా కృష్ణారావు, ఎం దేవరాజు, రైల్వే పుల్లన్న, టి.నాగరాజు, చెంచు రమేష్, కొత్తపల్లిసుంకిరెడ్డి ఎల్ఐసి నారాయణస్వామి తదితర కళాభివందలు, కళాకారులు, కళాపోషకులు ప్రజలు పాల్గొన్నారు.

# అంగన్వాడీల పట్ల కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది...!

- తల్లికి వందనం అంగన్వాడీలు అడక్కనే చంద్రబాబు ఇచ్చారు
- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం




**శ్రీ సత్య సాయి బ్యూరో - సూర్య వాస్తవం :** అంగన్వాడీల పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు చిత్తశుద్ధి ఉందని శ్రీ సత్య సాయి జిల్లా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. తల్లికి వందనం పథకం అంగన్వాడీ వర్కర్ల పిల్లలకు కూడా వర్తింపచేయడాన్ని హర్షిస్తూ గురువారం స్థానిక పివిఆర్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో అంగన్వాడి వర్కర్లు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి టిడిపి నాయకులు శేషు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్యోగుల పట్ల సుముఖంగా ఉన్నారని వారికి రావాల్సిన బెనిఫిట్స్ అన్నిటిని ఇవ్వడానికి ముందున్నారని అన్నారు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారథ్యంలో ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా రాష్ట్ర అభివృద్ధి కోసం శాయశక్తుల కృషి చేస్తున్నారని పేర్కొన్నారు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మీ వంతుగా అంగన్వాడీ వర్కర్లు గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గత ఐదేళ్ల పాలనలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు చేసింది శూన్యమని ఆరోపించారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నారా చంద్రబాబు నాయుడు అంగన్వాడీలకు వేతనాలను పెంచారని పేర్కొన్నారు అదేవిధంగా ప్రతి ఒక్క అంగనవాడి కార్యకర్తకు స్మార్ట్ ఫోన్ లను పంపిణీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. గ్రామాలలో అంగన్వాడి కార్యకర్తలుగా పనిచేస్తున్న మీరు ఐదు సంవత్సరాల లోపల పిల్లలకు తల్లి తర్వాత తల్లుల మనే విషయాన్ని గుర్తుపెట్టు కోవాల్సిన అవసరం ఉందని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని వివరించారు. లోటు బడ్జెట్ తో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రస్తుతం అభివృద్ధి దిశగా పరు గులు పెడుతుందని పేర్కొన్నారు అంగన్వాడి వర్కర్లు కూడా గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మీ న్యాయమైన కోరికలను డిమాండ్లను పరిష్కరించాలని నిరసనలు చేపట్టినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మీ పైన లాఠీ చార్జీలు చేసిన ఘటనలను కూడా మీరు గుర్తుపెట్టుకోవాలని గుర్తు చేశారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మంది పిల్లలకు తల్లికి వందనం పథకం కింద నగదును జమ చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం యువశక్తి సంఖ్య తగ్గిపోతున్న తరుణంలో పిల్లలకు జన్మను ఇవ్వాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు హేమలత సుజాత తదితరులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తమకు న్యాయం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం తమ సమస్యలను ఏమాత్రం పట్టించుకోలేదని, ప్రస్తుతం తమ కుటుంబాలకు కూడా ఉపయోగపడేలా 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేయడం పట్ల ప్రభుత్వం పట్ల కృతజ్ఞతాభావం వ్యక్తం చేశారు. అంగన్వాడి వర్కర్లు ఎమ్మెల్యేని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, ఆర్డీవో కళావతి, సిడిపిఓలు రాధిక నిహారిక సూపర్వైజర్లు మమత జయశ్రీ లక్ష్మీదేవి అలివేలమ్మ నరసమ్మ అంగన్వాడి వర్కర్స్ మరియు హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు పాల్గొన్నారు.



# పంటల బీమా నమోదు గడువు పెంచాలి

- ఉరవకొండ ఇన్‌చార్జ్ వై విశ్వేశ్వర్ రెడ్డి
- భూగర్భ జలాలు అడుగంటుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శ
- జిల్లాలో నీటి కొరత నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్
- రైతులకు కనీస మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపణ
- ఉరవకొండ ధర్నా జూలై 31 నుంచి ఆగస్టు 3కు వాయిదా
- ధర్నాకు రైతులు, ప్రజలు భారీగా హాజరై విజయవంతం చేయాలని పిలుపు



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** పంటల బీమా నమోదు గడువును ఆగస్టు 15 వరకు పొడిగించాలని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ నాయకుడు వై. విశ్వేశ్వర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉరవకొండలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో భూగర్భ జలాలు అడుగంటిపోతుండగా నదులు, చెరువులు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల బోర్లు ఎండిపోవడంతో ట్యాంకర్ల ద్వారా చెట్లకు నీరు అందించే పరిస్థితి ఏర్పడిందన్నారు. అనంతపురం జిల్లాలో నీటి కొరత సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. రైతులకు కనీస మద్దతు ధరలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మాటలకే పరిమితమవుతోందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా పంటల బీమా నమోదులో ఇప్పటివరకు 1,02,326 మంది రైతులు మాత్రమే నమోదు చేసుకున్నారని, ఇది అర్హులైన రైతుల్లో సుమారు 50 శాతమని తెలిపారు. మీసేవ కేంద్రాల్లో సర్వర్లు బిజీగా ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల బీమా నమోదు గడువును ఆగస్టు 15 వరకు పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అనుచరుల ఆగడాలు మితిమీరుతున్నాయని ఆరోపించారు. ఇటువంటి చర్యలను వైఎస్సార్సీపీ నాయకులు చూస్తూ ఊరుకోబోరని హెచ్చరించారు.

ఉరవకొండ నియోజకవర్గంలో జూలై 31న నిర్వహించాల్సిన ధర్నాను ఆగస్టు 3కు వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ ధర్నాకు ప్రజలు, రైతులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ధర్నా నిర్వహణకు పోలీసులు అనుమతి ఇవ్వాలని కూడా కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల తల్లిదండ్రులపై దురుసుగా ప్రవర్తించిన

# విద్యాశాఖ అధికారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి

**పామిడి - సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా పామిడి మండలం విద్యాశాఖ అధికారి జయ నాయక్ బుధవారం రోజున దేవరపల్లి ఓబులేష్ ఎంఈఓ కార్యాలయానికి వెళ్లి తన ఇద్దరు కుమారులకు ఎలిజిబుల్ లిస్టులో ఉన్నప్పటికీ తల్లికి వందనం డబ్బులు ఇంతవరకైనా జమ కాలేదని విద్యా శాఖ అధికారిని అడగగా వారు విద్యార్థుల తల్లిదండ్రు లను ఇష్టానుసారంగా మాట్లాడారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి నటువంటి విద్యాశాఖ అధికారికి పేద మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈఓ కార్యాలయానికి వెళ్లకూడదా ఉద్దేశం ఏమిటి ఇలా విద్యార్థి తల్లిదండ్రులను ఉద్దేశించి దురుసుగా సమాధానం చెబుతూ నువ్వు ఇలాగే నాతో మాట్లాడావంటే నీ ఇద్దరు పిల్లలకి తల్లికి వందనం డబ్బులు రాకోకుండా చేస్తాను అని ఎంఈఓ బెదిరించడం జరిగింది. ఈ కారణంగానే పట్టణంలో ఉన్నటువంటి ఎంఈఓ కార్యాలయం ముందు వైయస్సార్ విద్యార్థి విభాగంగా ధర్నా కార్యక్రమం నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులను దురుసుగా మాట్లాడినటువంటి మండల విద్యాశాఖ అధికారి జయ నాయక్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి లేనిపక్షంలో వైయస్సార్ విద్యార్థి విభాగంగా మరిన్ని ఉద్యమాలతో ముందుకు వెళ్తామని హెచ్చరిస్తున్నాం అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మైకు ముందర పెట్టుకొని గొప్పలు పలకడం కాదు మీ ప్రభుత్వంలో పని చేస్తున్నటువంటి విద్యాశాఖ అధికారులు పేద మధ్యతరగతి కుటుంబాల పైన ఏ విధంగా ప్రవర్తిస్తున్నారో తెలుసుకోవాలని ఈ ధర్నా ని ఉద్దేశించి మీకు తెలియజేస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశి యాదవ్, గుంతకల్ నియోజకవర్గ అధ్యక్షులు నక్క నారప్ప, గుంతకల్ మండలం ఉపాధ్యక్షుడు మాల గణేష్, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కల సూరి, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు ఓబులేసు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కృష్ణ నాయక్, విద్యార్థి నాయకులు కృష్ణారెడ్డి, వెంకటేష్, భార్గవ్ ఏకాంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# నాల్గవ రోజు ఇంటింటికి తెలుగుదేశం

- ప్రభుత్వ సంక్షేమాలు వివరించిన ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి

**ప్యాపిలి - సూర్య వాస్తవం :** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "2 ఏళ్ల నమ్మకం -- సంక్షేమం, అభివృద్ధి -- ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమం నాలుగో రోజు ప్యాపిలి మండలంలోని అలేబాద్ తండా గ్రామంలో విశేష ప్రజాదరణతో కొనసాగింది. ఈ కార్యక్రమంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొని ఇంటింటికీ వెళ్లి గ్రామ ప్రజ లను ఆప్యాయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్య క్రమాలు ప్రజలకు ఎలా ఉపయోగపడుతున్నాయో ఎమ్మెల్యే వివరిం చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గ్రామస్తుల సమస్యలు, అవసరాలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలు ప్రతి కుటుంబానికి చేరేలా పార్టీ శ్రేణులు మరింత చురుకుగా పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# టీడీపీ ఇంటింటి ప్రచారం

- మంచి ప్రజాపాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వం
- మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి
- టిడిపి పట్టణ అధ్యక్షుడు బోనమల ఖాదర్ వలి



**రాయచోటి - సూర్య వాస్తవం:** గత ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నా రని, ప్రస్తుతం ఆంధ్ర రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మంచి సుపరిపాలన అందిస్తుందని రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి, టిడిపి రాయచోటి పట్టణ అధ్యక్షుడు బోనమల ఖాదరవల్లిలు అన్నారు. అన్నమయ్య జిల్లా పరిధిలోని రాయచోటి నియోజకవర్గంలోని బూత్ నెంబర్ 152,153 నందు రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి, రాయచోటి నియోజకవర్గ నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ఆదేశానుసారం బూత్‌లలో మార్కెట్ కమిటీ చైర్మన్, పట్టణ అధ్యక్షుడు వార్డు మెంబర్లు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలతో కలిసి కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల పూర్తి అయిన సందర్భం గా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను 'డోర్ టు డోర్' కార్యక్రమంలో ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాల గురించి మున్సి పాలిటీ పరిధిలోని పలు వార్డులలో గురువారం పర్యటించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ




**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం :** గ్రామస్థాయి అవసరాలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించు టకు మంచి గ్రామస్థాయి ప్రణాళిక సిద్ధం చేయాలని మండల పరిషత్ అధ్యక్షులు సి. వీరనారాయణరెడ్డి తెలిపారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీలో భాగంగా శిక్షణ కార్యక్రమమును ముల్లల కేంద్రం లోని మండల పరిషత్ కార్యాలయ సభా భవనము, నందు నిర్వహించారు. ఈ సమావేశానికి మండల పరిషత్ అధ్యక్షులు సి.వీర నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. సదరు సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామచంద్రారెడ్డి, పరిపాలన అధికారి, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి (గ్రామపంచాయతీలు), ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి( జి.ఎస్.డబ్ల్యూ.ఎస్), మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు, మండల స్థాయి అధికారులు, గ్రామ పంచా యతీ ప్రత్యేక అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, డిజిటల్ సహాయ కులు, ఇంజనీరింగ్ సహాయకులు, వి.ఒ.ఎ సభ్యులు పాల్గొన్నారు.

# స్నేహ దినోత్సవ శుభాకాంక్షలు

- రిటైర్డ్ మండలం తహశీల్దార్ ఉమామహేశ్వర్



**రాయచోటి - సూర్య వాస్తవం:** స్నేహం అంటే కేవలం పరిచయం కాదు. సుఖంలో తోడు నిలిచేవాడు కాదు. కష్టకాలంలో చేయి పట్టి నిలబెట్టేవాడే నిజమైన, ప్రియమైన స్నేహితుడు అని రిటైర్డ్ మండల తహశీల్దార్, ప్రముఖ కళాకారుడు ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం ఆంధ్ర పత్రిక విలేకరితో కలిసిన ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిత్రులందరికీ అంతర్జాతీయ స్నేహ దినోత్సవ శుభా కాంక్షలు తెలియజేశారు. కలకాలం తోడు ఉండేవాడే నిజమైన ప్రియమైన స్నేహితుడు అన్నారు.

# దేశంలో తొలిసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో..

# రాష్ట్రంలో తొలిసారి పోలవరం జిల్లాలో ఆర్‌బిఎస్ కె 2.0కు శ్రీకారం

- 62.65 లక్షల మంది పిల్లలకు 38 రకాల ఉచిత ఆరోగ్య పరీక్షల నిర్వహణకు శ్రీకారం
- రంపచోడవరం ముసురుమిల్లి పాఠశాలలో రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన మంత్రి సత్య కుమార్ యాదవ్




**దొరవారిసత్రం- సూర్య వాస్తవం :** చిన్నారుల్లో ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైన చికిత్సను ఉచితంగా అందించేందుకు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం-2.0 కింద సమగ్ర ఆరోగ్య పరీక్షలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పోలవరం జిల్లా రంపచోడవరంలోని ముసురుమిల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి ఆరోగ్య పరీక్షల ప్రారంభ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ గురువారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు. దేశంలో తొలిసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో..రాష్ట్రంలో తొలిసారి పోలవరం జిల్లా లో ఆర్ బిఎస్ కె 2.0 పరీక్షల నిర్వహణకు మంత్రి శ్రీకారం చుట్టడం విశేషం. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించి విద్యార్థులతో వారి ఆరోగ్య పరిస్థితుల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ మాట్లాడారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పాఠశాలల వరకు ఉన్న ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఉండాలన్న దే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణించగలరని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోగలరని పేర్కొన్నారు. అందుకే పిల్లలకు అనారోగ్యం వచ్చిన తర్వాత వైద్యం చేయడం మాత్రమే కాకుండా, సమస్యలను ముందుగానే గుర్తించి నివారించే విధానానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే ఈ కార్యక్రమాన్ని గిరిజన పిల్లలు అధికంగా ఉన్న రంపచోడవరం ప్రాంతం నుంచి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్య సేవలే ప్రజలకు ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న వైద్యుల ఖాళీలను భర్తీ చేసే దిశగా కేవలం మూడు నెలల్లో 12 మంది వైద్యులను కేటాయించడం వల్ల పీహెచ్‌సీలలో వైద్య సేవలు మెరుగుపడ్డాయని చెప్పారు. నిర్మాణంలో ఉన్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ ఏడాది రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం-2.0 కింద 62,65,410 మంది చిన్నారులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. వీరిలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఆరేళ్లలోపు చిన్నారులు 20,95,129 మంది, ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ పాఠశాలల్లో చదువుతున్న ఆరు నుంచి 18 ఏళ్ల వయసు వారు 41,70,281 మంది ఉన్నారని వివరించారు. మారిన జీవనశైలికి అనుగుణంగా చిన్నారులకు పరీక్షలు పుట్టుకతో వచ్చే లోపాలు, వివిధ వ్యాధులు, పోషకాహార లోపాలు, శారీరక--మానసిక ఎదుగుదలలో ఆలస్యం సహా 38 రకాల ఆరోగ్య సమస్యలను ఈ పరీక్షల్లో గుర్తిస్తామన్నారు. జీవనశైలి విధానంలో వస్తున్న మార్పులకు తగ్గట్లు గతంలో ఉన్న పరీక్షలకు ఆదనంగా చిన్నారులకు అధిక రక్తపోటు, మధుమేహం, ఊబకాయం, మూత్రపిండాలు--మూత్రనాళ సమస్యలు, మానసిక ఇబ్బందులు, అధిక చరవాణి (సెల్ ఫోన్) వినియోగం, నిద్రకు సంబంధించిన సమస్యలపైనా దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. పిల్లల్లో సమస్యను ఎంత త్వరగా గుర్తిస్తే అంత సులభంగా చికిత్స చేయవచ్చని మంత్రి పేర్కొన్నారు. పుట్టుకతో వచ్చే గుండె సమస్యలు, పెదవి--అంగిలి చీలిక, కాళ్లలో పుట్టుకతో వచ్చే లోపాలు, నాడీ సంబంధిత సమస్యలు వంటివి చిన్న వయసులోనే గుర్తించి వైద్యం అందిస్తే భవిష్యత్తులో అంగవైకల్యం సహా అనేక సమస్యలను నివారించవచ్చన్నారు.

**"గుర్తింపుతో ఆగకుండా చికిత్స వరకు"...!**

ఆరోగ్య పరీక్షల్లో సమస్య బయటపడిన చిన్నారులను సమీప ప్రభుత్వ ఆసుపత్రులు, జిల్లా స్థాయి చిన్నారుల చికిత్స కేంద్రాలు, అవసరమైతే ఉన్నత వైద్య సంస్థలకు పంపించి ఉచితంగా చికిత్స అందిస్తున్నామని మంత్రి తెలిపారు. వ్యాధిని గుర్తించి పంపించడంతో బాధ్యత ముగిసినట్లు భావించకుండా, చికిత్స పూర్తయ్యే వరకు ప్రతి చిన్నారినీ పర్యవేక్షించాలనే స్పష్టమైన విధానంతో ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. రాష్ట్రంలో ఇందుకోసం 34 జిల్లా స్థాయి చిన్నారుల చికిత్స కేంద్రాలు పనిచేస్తున్నాయని, గత రెండేళ్లలో వీటి ద్వారా దాదాపు 4.85 లక్షల మంది చిన్నారులకు వైద్య సేవలు అందాయని చెప్పారు. చికిత్స అవసరమైన పిల్లలను ఆసుపత్రులకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక వాహన సదుపాయం కూడా కల్పిస్తున్నామన్నారు. గత రెండేళ్లలో బాల ఆరోగ్య కార్యక్రమం కింద 3,214 శస్త్రచికిత్సలు నిర్వహించామని, శస్త్రచికిత్సలు, నులిపురుగుల నివారణ, క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది సేవలు తదితరాల కోసం కలిపి సుమారు రూ.25.78 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి వెల్లడించారు.....

**"43.30 లక్షల మందికి కంటి పరీక్షలు"**

పిల్లల్లో చూపు సమస్యలను కూడా ముందుగానే గుర్తించేందుకు ఈ ఏడాది ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 43.30 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. వారిలో చూపు సమస్యలున్న వారిని గుర్తించి అవసరమైన చికిత్సతో పాటు 2.50 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లజోళ్లు అందించనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.7 కోట్లు కేటాయించిందన్నారు. తమకు చూపు సరిగా లేదనే విషయాన్ని చాలామంది పిల్లలు బయటకు చెప్పుకోలేరని మంత్రి పేర్కొన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు బోర్డుపై రాసినది కనిపించకపోవడంతో చదువులో వెనుకబడే పరిస్థితి ఏర్పడవచ్చన్నారు. అలాంటి పిల్లలను చదువులో బలహీనులుగా భావించే అవకాశం కూడా ఉంటుందని చెప్పారు. అందుకే పాఠశాలకే వైద్య బృందాలను పంపించి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లజోళ్లు అందించడం ద్వారా చదువుకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కిశోర దశలో పిల్లలు శారీరక మార్పులతో పాటు మానసికంగా అనేక సమస్యలను ఎదుర్కొంటారని మంత్రి తెలిపారు. కొన్ని విషయాలను తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు చెప్పేందుకు సంకోచిస్తారని, సమస్యలను లోలోపలే దాచుకోవడం వల్ల తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. అటువంటి పరిస్థితుల్లో వారికి దగ్గరగా ఉండే తోటి విద్యార్థులే మొదటి భరోసాగా నిలవాలనే ఉద్దేశంతో రాష్ట్రీయ కిశోర స్వాస్థ్య కార్యక్రమాన్ని (ఆర్ కె ఎస్ కె) బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,317 కిశోర మైత్రి ఆరోగ్య కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, 61,556 మంది తోటి విద్యార్థి మార్గదర్శకులను సిద్ధం చేశామని తెలిపారు. ముఖ్యంగా కిశోర బాలికలు రుతుస్రావం, వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత, ఇతర ఆరోగ్య సమస్యల గురించి మాట్లాడేందుకు సంకోచించకూడదన్నారు. మానసిక సమస్యలను కూడా సాధారణ ఆరోగ్య సమస్యల మాదిరిగానే చూడాలని, ఎవరేమనుకుంటారోననే భయంతో వాటిని దాచుకోవద్దని విద్యార్థులకు మంత్రి సత్య కుమార్ యాదవ్ సూచించారు.

**"పిల్లల ఆరోగ్యమే రాష్ట్ర భవిష్యత్తు"**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వంముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పిల్లల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ తెలిపారు. పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఐఏఎస్ మాట్లాడుతూ జీరో వేకెన్సీ పాలసీ వల్ల పోలవరం పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అవసరాలకు తగ్గట్టుగా అందుబాటులోకి వచ్చారని చెప్పారు. గిరిజనులకు వైద్య సేవలు మెరుగుపరుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్.పద్మావతి జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ శ్రీమతి జె.విజయలక్ష్మి ఆర్ బి ఎస్ కె స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఆర్ కె ఎస్ కె స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ నిరామల గ్లోరీ, పోలవరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పి.సరిత, శాసనసభ సభ్యురాలు మిరియాల శిరీష, ఇతర అధికారులు పాల్గొన్నారు. మంత్రి తన ప్రసంగంలో కలెక్టర్ దినేష్ కుమార్ ఐఏఎస్ పాలన గురించి అభినందించారు. కార్యక్రమం ప్రారంభం ముందు మంత్రి ఆర్ బి ఎస్ కె ఆర్ కే ఎస్ కె, ఇయ్ స్క్రీనింగ్ స్టాల్స్ ను సందర్శించారు.

## చేనేత సమ్మేళనం విజయవంతం చేయాలని పిలుపు




**దొరవారిసత్రం- సూర్య వాస్తవం :** సూళ్లూరుపేట మండల పరిధిలోని మన్నార్ పోలూరు గ్రామంలో ఉన్న శాంతి నగర్‌లో గురువారం భారతీయ జనతా పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా ఓబీసీ అధ్యక్షులు గోపి ఆచారి ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా ఓబీసీ కమిటీ విజయవాడలో ఆగస్టు 5వ తేదీన జరిగే చేనేత సమ్మేళన విజయవంతం చేయమని పిలుపునిచ్చారు. అనంతరం చేనేత సమ్మేళన కరపత్రం ప్రెస్ నోట్ ద్వారా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట టౌన్ అధ్యక్షులు అత్తిరాల కిరణ్ కుమార్ గౌడ్, తిరుపతి జిల్లా కార్యదర్శి బెజవాడ విజయమ్మ, ఓబీసీ మోర్చా కార్యదర్శి పిచ్చుక సూరిబాబు, తడ మండల బిజెపి అధ్యక్షులు తేజ రెడ్డి, అధ్యక్షుడు గుర్రప్ప, ప్రధాన కార్యదర్శి చింతపట్ల బాలమురళీకృష్ణ, సూళ్లూరుపేట రూరల్ ప్రధాన కార్యదర్శి వాసు కుమార్ గౌడ్, చేనేత రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఎంఎం, శ్రీనివాసులు, బిజెపి నాయకురాలు ఎంఎం పద్మజ బిజెపి కార్యకర్తలు, నాయకులు మన్నారు, పోలూరు, దేవాంగ చేనేత ప్రముఖులు అందరూ కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



## ప్రతి గడపలో నమ్మకం.. ప్రతి కుటుంబానికి సంక్షేమం

- నాయుడుపేటలో ఘనంగా కూటమి ప్రభుత్వ రెండేళ్ల ద విజయోత్సవ ప్రచారం"
- తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షురాలు పనబాక లక్ష్మికి ఘన స్వాగతం
- శాలువా, పూలమాలతో సత్కారం
- మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంతో కలిసి భారీ ర్యాలీ
- గోమతి సర్కిల్ నుంచి బీడీ కాలనీ వరకు ప్రజలతో మమేకం
- ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ ప్రజల సమస్యలపై ఆరా



**నాయుడుపేట- సూర్య వాస్తవం:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు నేరుగా చేరవేసే లక్ష్యంతో చేపట్టిన "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం నాయుడుపేట పట్టణంలో గురువారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ప్రజల నుంచి విశేష స్పందన లభించడంతో కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షురాలు శ్రీమతి పనబాక లక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమెకు పార్టీ నాయకులు, కార్యకర్తలు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గోమతి సర్కిల్ నుంచి బీడీ కాలనీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ లో పార్టీ శ్రేణులు, మహిళలు, యువకులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ర్యాలీ అనంతరం నాయకులు బీడీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రత్యేకంగా రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజలతో నేరుగా మాట్లాడి ప్రభుత్వ పనితీరుపై వారి అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు, స్థానిక సమస్యలను శ్రద్ధగా విని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక, జవాబుదారీతనం తో కూడిన పాలన అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారత, యువత ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధి, సామాజిక భద్రత వంటి ప్రతి రంగంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలు రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తున్నాయని వివరించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ సంక్షేమం--అభివృద్ధి అనే రెండు చక్రాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా కృషి జరుగుతోందని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా ప్రతి హామీని అమలు చేయడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. ఇంటింటి ప్రచారం సందర్భంగా ప్రజలు నాయకులకు ఆత్మీయ స్వాగతం పలికారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలపై సానుకూల అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ, తమ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని నాయకులు హామీ ఇవ్వడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షురాలు శ్రీమతి పానబాక లక్ష్మి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, 786 రఫీ, అవధానం సుధీర్, మైలారి రాజశేఖర్, బందిలి మోహన్ తో పాటు కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# ‘శ్రీనివాస మంగాపురం’ మూవీ రివ్యూ

**సూపర్‌స్టార్ కృష్ణ మనుమడు .. రమేష్‌బాబు తనయుడు ‘జై కృష్ణ’ హీరోగా రూపొందిన సినిమానే ‘శ్రీనివాస మంగాపురం’. రవీనా టాండన్ కూతురు ‘రాషా తడాని’ ఈ చిత్రంతో హీరోయిన్‌గా పరిచయమైంది. సీనియర్ నటుడు మోహన్‌బాబు ఈ చిత్రంలో కీలక పాత్రను పోషించారు. అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం జై కృష్ణకు విజయాన్నిఅందిస్తుందా? ‘శ్రీనివాస మంగాపురం’లో ప్రేక్షకులను అలరించే అంశాలున్నాయా? అనేది రివ్యూలో తెలుసుకుందాం.**



తిరుపతిలో పెద్దిరెడ్డి (‘కిక్’ శ్యామ్) అంటే అందరికి హడల్. ఆయన కూతురు ‘మంగ’ (రాషా తడాని)ని చూసి ప్రేమలో పడతాడు శ్రీను అలియాస్ వాసుబాబు (జై కృష్ణ). శ్రీను రోజు ఆమెను ఫాలో అవుతుంటాడు. తనకు ఇష్టం లేదని ఆమె ఎంతగా చెప్పినా అతను వినిపించుకోడు. ఒకరోజు నాటకం రిహార్సల్‌లో ఆమెకి శ్రీను సహాయం చేస్తాడు. ఆమెతో చనువు పెంచుకుని ప్రేమలో పడేయాలని ప్రయత్నిస్తుంటాడు. అప్పటికే ‘మంగ’కి పెళ్లి కుదిరిపోతుంది.ద శ్రీను ఆమె నిశ్చితార్థానికి కూడా వెళతాడు. ఒకరోజు ‘మంగ’కి తను ప్రేమిస్తున్న విషయాన్ని చెబుతాడు. ఆమె శ్రీను ప్రేమను తిరస్కరిస్తుంది. మంగపట్ల శ్రీను ధోరణి గురించి తెలుసుకున్న పెద్ది రెడ్డి మనుషులు, అతనిపై దాడిచేయాలని చూస్తారు. ఆ సందర్భంలోనే అజయ్ అండ్ గ్యాంగ్ నుంచి పెద్దిరెడ్డి మనుషులను శ్రీను రక్షిస్తాడు. అయితే పెద్ది రెడ్డి చెల్లెలు వెళ్లి తన మేనకోడలిని వదిలేయమని శ్రీనును కోరుతుంది. ఈ క్రమంలోనే ఆమె శ్రీనును వాసుబాబు పేరుతో పిలుస్తుంది.వాసుబాబు శ్రీనుగా ఎందుకు మారతాడు? ఈ కథకు వెంకటప్పయ్య నాయుడు (మోహన్ బాబు)కు ఉన్న సంబంధమేమిటి? శ్రీను తిరుపతికి ఎందుకొస్తాడు? శ్రీను - మంగ ప్రేమకథ ఎలాంటి మలుపులు తిరుగుతుంది? అనేది మిగతాకథ. సినిమా నేపథ్యం ఉన్న వారసుడిని హీరోగా పరిచయం చేస్తున్నప్పుడు ఖచ్చితంగా కథలో కొత్తదనం ఉండాలి.. వేగం ఉండాలి. ఇక ప్రేమకథ అయితే మరింత జాగ్రత్త తీసుకోవాలి. ఇప్పటివరకు వచ్చిన ప్రేమకథలకు, చెబుతున్న ప్రేమకథకు మధ్య వైవిధ్యం ఉండాలి. లేకపోతే ఆ ప్రేమకథ రొటిన్ అయిపోతుంది. ప్రేక్షకులు రొటిన్ ప్రేమకథలపై ఏ మాత్రం ఆసక్తి చూపరు. సరిగ్గా ‘శ్రీనివాస మంగాపురం’ విషయంలో ఇదే జరిగింది. రొటిన్, రెగ్యులర్ మూస ఫార్ములాతో అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ చిత్రం ప్రేక్షకులను విసిగించడమే కాకుండా, ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెట్టింది. సినిమా ప్రారంభం నుంచి చివరివరకు రొటిన్‌గా అనిపించడమే ఈ చిత్రానికి ఉన్న అతిపెద్ద మైనస్. రెగ్యులర్ రొటిన్ స్టోరీ, ఏ మాత్రం ఆసక్తి కలిగించని సన్నివేశాలు, మచ్చుకైనా కనిపించని కొత్తదనం వెరసి ‘శ్రీనివాస మంగాపురం’ను ఓ బోరింగ్ రొటిన్ సినిమాగా మార్చేసింది. సినిమా ఆద్యంతం మూస ఫార్ములాలోనే కొనసాగుతుండటంతో ఎక్కడా కూడా వాట్ నెక్ట్స్ అనే ఆసక్తి ఆడియన్స్‌లో కనిపించదు. ఆడియన్స్ ముందే ఊహించగలిగే సన్నివేశాలతో నిదానంగా సాగుతున్న కథలో, ఎక్కడైనా ఎప్పుడైనా కథ కొత్త మలుపు తిరుగుతుందేమో అని ఎదురుచూస్తాం. కానీ మొదటి నుంచి చివరివరకు పాత బాటలోనే సాగుతుంది. స్క్రీన్‌ప్లే ఎటు పోతుందో అర్థం కాకుండా ఉంటుంది. రచనలో కొత్తదనం లేకపోవడంతో పాటు, సందర్భం లేకుండా వచ్చే పాటలు కథలో ఉన్న బలహీనతలను మరింత స్పష్టంగా కనిపించేలా చేస్తాయి. కథలో ఎమోషన్స్ పండకపోవడంతో ప్రేక్షకుడు ఏ పాత్రతో కనెక్ట్ కాలేడు. ఈ చిత్రంలో ప్రేమకథను చూస్తున్నప్పుడు మనకు ఇంతకు ముందుచూసిన ప్రేమకథలు గురొస్తాయి.దీంతో ఈ ప్రేమకథను ఎవరి హృదయానికి హత్తుకోదు. కథ, కథనాలు ఏ దశలోనూ ఆసక్తి కలిగించకుండా, అత్యంత పేలవంగా ఓ మూస ఫార్ములా ప్రకారమే కొనసాగింది.స్క్రీన్ మీద జై కృష్ణ లుక్ బాగుంది. కానీ యాక్టింగ్ పరంగా ఇంకాస్త బెటర్ అవ్వాల్సిందే. తొలిచిత్రంతో నటుడిగా జై కృష్ణ ఎక్కడా డిజప్పాయింట్ చేయకపోయినా, బలమైన కథతో వచ్చి ఉంటే జై కృష్ణ పూర్థి స్థాయిలో తన నటనను ప్రూవ్ చేసుకునేవాడు. కానీ ఈ సినిమా ఆయనకు ఆ అవకాశాన్ని ఇవ్వలేదు. రషా తడానీ క్యూట్‌గా ఉంది. వెంకటప్ప నాయుడుగా మోహన్‌బాబు పాత్ర మెప్పిస్తుంది.స్వతంత్ర బాబు పాత్రలో నరేష్ వినోదం పండించే ప్రయత్నం చేశాడు. అజయ్, వాసుకిలు వాళ్ల పరిధి మేరకు నటించారు. జయకృష్ణ గుమ్మడి ఫోటోగ్రఫీ విజువల్స్ బాగున్నాయి. జీవీ ప్రకాష్ కుమార్ నేపథ్య సంగీతం పరవాలేదు. అజయ్ భూపతి రచన ఈ సినిమాకు పెద్ద మైనస్. ఓవరాల్‌గా కొత్తదనం లేని కథతో, ఊహకందే సన్నివేశాలతో తెరకెక్కిన ‘శ్రీనివాస మంగాపురం’, రొటిన్ సినిమాగ చెప్పుకోవచ్చు.



## ‘యానిమల్’లాంటి సినిమాలు ఇక చేయొద్దు.. రణ్‌బీర్‌కు ‘మహాభారత్ కృష్ణుడి’ విజ్ఞప్తి

బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్‌కు ప్రముఖ నటుడు నితీశ్ భరద్వాజ్ కీలక సూచన చేశారు. ‘యానిమల్’ వంటి సినిమాల్లో ఇకపై నటించొద్దని, తన వాణిని కలుషితం చేసుకోవద్దని కోరారు. త్వరలో విడుదల కానున్న ‘రామాయణ’ సినిమా ట్రైలర్‌పై స్పందిస్తూ సోషల్ మీడియాలో ఈ వ్యాఖ్యలు చేశారు. భారతీయ సంస్కృతి, విలువలను కాపాడే బాధ్యత ఇప్పుడు రణ్‌బీర్‌పై ఉందని పేర్కొన్నారు.బీఆర్ చోప్రా రూపొందించిన టెలివిజన్ ధారావాహిక ‘మహాభారత్’లో శ్రీకృష్ణుడి పాత్రతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన నితీశ్ భరద్వాజ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో ‘రామాయణ’ పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ చిత్ర బృందంపై ప్రశంసల వర్షం కురిపించారు. దర్శకుడు నితీశ్ తివారీ ప్రపంచ సినిమాకు భారత్ అందించే మరో గొప్ప బహుమతిగా నిలుస్తారని అభిప్రాయపడ్డారు. ఈ చిత్రం ఉత్తమ విదేశీ చిత్రంగా ఆస్కార్ అవార్డు గెలిచే స్థాయి కలిగి ఉందని వ్యాఖ్యానించారు.వీఎఫ్ఎక్స్, ఏఐ సాయంతో అద్భుతమైన ప్రపంచాన్ని తెరపై ఆవిష్కరించారని నితీశ్ కొనియాడారు. నిర్మాణ రూపకల్పన, సినిమాటోగ్రఫీకి ఎన్నో అవార్డులు వస్తాయని చెప్పారు. హాలీవుడ్ సంగీత దిగ్గజం హాన్స్ జిమ్మర్ భారతీయ సినిమాతో కలిసి పనిచేయడం గర్వకారణమని పేర్కొన్నారు. రణ్‌బీర్ కపూర్, రణ్‌వీర్ సింగ్ ఇద్దరూ భారతీయ సినీ రంగంలోని అగ్ర నటులుగా నిలుస్తారని అభిప్రాయపడ్డారు. యశ్‌కు ప్రపంచ సినీ రంగంలోకి స్వాగతం పలికారు.రణ్‌బీర్‌ను ఉద్దేశిస్తూ నితీశ్ ప్రత్యేక సందేశం ఇచ్చారు. నటుడిగా ఆయనంటే ఎప్పటి నుంచో ఇష్టమని చెప్పారు. ఇకపై భారతీయ వారసత్వం, సంస్కృతి, విలువలను నిలబెట్టే బాధ్యత ఆయనపై ఉందన్నారు. ఎంత పెద్ద పారితోషికం ఇచ్చినా ‘యానిమల్’ లాంటి సినిమాలు చేయొద్దని కోరారు. భారతదేశంలో నటనకు అవకాశమిచ్చే గొప్ప కథలు ఎన్నో ఉన్నాయని గుర్తు చేశారు. అలాగే సీత పాత్రలో సాయిపల్లవిని ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సినిమాలో తులసీదాస్ చౌపాయిల స్వరాలు కూడా వినిపిస్తే బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో వచ్చిన ‘యానిమల్’ భారీ వసూళ్లు సాధించినా, మహిళలను చూపిన తీరు, అధిక హింస, రక్తపాతం వంటి అంశాలపై తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. మరోవైపు నితీశ్ తివారీ తెరకెక్కిస్తున్న ‘రామాయణ’ ట్రైలర్ గురువారం విడుదలైంది. భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందిన ఈ చిత్రం 2026 నవంబర్ 8న ప్రేక్షకుల ముందుకు రానుంది.



# జెర్సీ రంగు మార్పు వెనుక అసలు కారణమిదే..

# వివాదానికి తెరదించిన హాకీ ఇండియా

**- హాకీ జట్ల జెర్సీ రంగు మార్పుపై చెలరేగిన వివాదంపై హాకీ ఇండియా క్లారిటీ-- నీలి రంగు టర్ఫ్‌పై బ్లూ జెర్సీ కలిసిపోతోందని, అందుకే ఈ మార్పు అని వెల్లడి**

**- మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా అభ్యంతరంతో సోషల్ మీడియాలో మొదలైన చర్చ- జాతీయ జెండాలో భాగం కావడంతోనే కాషాయ రంగును ఎంచుకున్నామని వివరణ-- గతంలోనూ జెర్సీ రంగులు మార్చామని గుర్తు చేసిన హాకీ ఇండియా**




భారత జాతీయ హాకీ జట్ల జెర్సీ రంగును సాంప్రదాయ నీలి రంగు నుంచి కాషాయ రంగుకు మార్చడంపై చెలరేగిన వివాదంపై హాకీ ఇండియా స్పందించింది. ఇది కేవలం సాంకేతిక అవసరాల దృష్ట్యా ఆటగాళ్లు, సహాయక సిబ్బంది సూచనల మేరకే తీసుకున్న నిర్ణయమని స్పష్టం చేసింది. ఈ మార్పు వెనుక ఉన్న అసలు కారణాలను వివరిస్తూ ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది.వచ్చే నెల నెదర్లాండ్స్, బెల్జియంలో జరగనున్న 2026 హాకీ ప్రపంచకప్‌లో పురుషుల, మహిళల జట్లు కాషాయ రంగు జెర్సీలతో బరిలోకి దిగుతాయని ఈ నెల 27న హాకీ ఇండియా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయంపై సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ముఖ్యంగా భారత హాకీ మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా ఈ మార్పును ప్రశ్నించడంతో వివాదం మరింత పెద్దదైంది.

### అసలు కారణం ఇదేనన్న హాకీ ఇండియా

ఈ వివాదంపై స్పందించిన హాకీ ఇండియా.. “అంతర్జాతీయ హాకీ పిచ్‌లు ఇప్పుడు ప్రామాణికంగా నీలి రంగు సింథటిక్ టర్ఫ్‌తో ఉంటున్నాయి. మన ఆటగాళ్లు ధరించే నీలి రంగు జెర్సీ ఈ టర్ఫ్‌లో కలిసిపోతోంది. దీనివల్ల మైదానంలో ఆటగాళ్లకు స్పష్టత లోపించి, ఆటపై ప్రభావం పడుతోంది. ఈ సాంకేతిక సమస్యను అధిగమించేందుకే జెర్సీ రంగు మార్చాలని నిర్ణయించాం” అని తన ప్రకటనలో పేర్కొంది. ఆటగాళ్లు, కోచ్‌లతో విస్తృతంగా చర్చించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేసింది.

### రస్కిన్హా అభ్యంతరం.. రాజకీయ రంగు

మరోవైపు మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా తన ‘ఎక్స్’ (ట్విట్టర్) ఖాతాలో.. “భారత హాకీకి నీలి రంగు అనేది గర్వకారణం, గుర్తింపు, వారసత్వం” అని అన్నారు. ఆయన పోస్ట్ వైరల్ కావడంతో చర్చ మొదలైంది. అయితే, తన పోస్టుకు అనవసరంగా రాజకీయ రంగు పులుముతున్నారని ఆయన ఆ తర్వాత ఆవేదన వ్యక్తం చేశారు.

### గతంలోనూ మార్చాం..

ఆటగాళ్లు, కోచ్‌లు పసుపు లేదా కాషాయం రంగును ప్రత్యామ్నాయంగా సూచించారని, మన జాతీయ జెండాలో కాషాయం రంగు ధైర్యానికి, త్యాగానికి, జాతీయ గౌరవానికి ప్రతీక కావడంతో దానిని ఖరారు చేశామని హాకీ ఇండియా తెలిపింది. జెర్సీ రంగును మార్చడం ఇదే మొదటిసారి కాదని కూడా గుర్తు చేసింది. “2014 ప్రపంచకప్‌లో జట్టు జెర్సీని పసుపు రంగులోకి, 2018 ప్రపంచకప్‌లో స్కై బ్లూ రంగులోకి మార్చాం. కార్యాచరణ అవసరాల మేరకు గతంలోనూ ఇలాంటి మార్పులు జరిగాయి” అని వివరించింది. సాంకేతిక అవసరాలు, జాతీయ భావన రెండింటినీ పరిగణనలోకి తీసుకుని ఈ మార్పు చేసినట్లు హాకీ ఇండియా స్పష్టం చేసింది.




## కామన్వెల్త్‌లో నీరజ్ దూకుడు..? రోహిత్, యశ్‌వీర్‌తో కలిసి ఫైనల్‌కు

- ఫైనల్లో నీరజ్-అర్షద్ పోరుపై ఆసక్తి

గ్లాస్గో వేదికగా జరుగుతున్న 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్‌కు జావెలిన్ త్రో విభాగంలో శుభారంభం లభించింది. ఒలింపిక్ ఛాంపియన్ నీరజ్ చోప్రాతో పాటు రోహిత్ యాదవ్, యశ్‌వీర్ సింగ్ ముగ్గురూ పురుషుల జావెలిన్ త్రో ఫైనల్‌కు అర్హత సాధించారు. బలమైన గాలుల కారణంగా అథ్లెట్లకు త్రో విసరడం కష్టంగా మారినా, అత్యుత్తమ ప్రదర్శన చేసిన 12 మంది ఫైనల్‌కు చేరుకున్నారు. శుక్రవారం జరిగే ఫైనల్లో ఈ ముగ్గురు భారత అథ్లెట్లు పతకాల కోసం పోటీ పడనున్నారు.ఈ అర్హత పోటీలో ఆటోమేటిక్ క్వాలిఫికేషన్ దూరమైన 84 మీటర్లను ఏ అథ్లెట్ అందుకోలేకపోయాడు. నీరజ్ చోప్రా తన రెండో ప్రయత్నంలో 79.61 మీటర్లు విసిరి ఐదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరాడు. అప్పటికే అర్హత ఖరారవడంతో చివరి ప్రయత్నాన్ని ఉపయోగించుకోలేదు. రోహిత్ యాదవ్ 78.37 మీటర్లు విసిరి తొమ్మిదో స్థానంలో నిలిచాడు. యశ్‌వీర్ సింగ్ 78.36 మీటర్లతో పదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు.గతేడాది సెప్టెంబర్ నుంచి నీరజ్ చోప్రాను నడుము కింది భాగం గాయం వేధిస్తోంది. ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు ముందు ఈ గాయం కావడంతో అతను ఆశించిన స్థాయిలో రాణించలేక ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. గాయం కారణంగా ఈ ఏడాది సీజన్‌ను కూడా ఆలస్యంగా ప్రారంభించాడు. జూన్‌లో జరిగిన దోహా డైమండ్ లీగ్‌లో ఒక్కసారి మాత్రమే బరిలోకి దిగి 85.69 మీటర్లు విసిరి నాలుగో స్థానంలో నిలిచాడు.అర్హత పోటీలో శ్రీలంక అథ్లెట్ రుమేశ్ పతిరాజే 82.84 మీటర్లు విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ సీజన్‌లో అతని పేరిట ప్రపంచంలోనే అత్యుత్తమ త్రో 92.62 మీటర్లు ఉంది. గ్రెనడాకు చెందిన రెండుసార్ల ప్రపంచ ఛాంపియన్ అండర్సన్ పీటర్స్ 81.29 మీటర్లతో రెండో స్థానంలో నిలిచాడు. దక్షిణాఫ్రికా అథ్లెట్ డౌ స్మిట్ 80.64 మీటర్లతో మూడో స్థానం దక్కించుకున్నాడు.ఇంగ్లండ్‌కు చెందిన బెన్ ఈస్ట్ నాలుగో స్థానంలో నిలవగా, ఆస్ట్రేలియా అథ్లెట్ కామెరాన్ మెక్‌ఎంటైర్ ఆరో స్థానంలో నిలిచాడు. ఒలింపిక్ ఛాంపియన్, పాకిస్థాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ ఈ సీజన్‌లో తన అత్యుత్తమ ప్రదర్శనగా 78.63 మీటర్లు విసిరి ఏడో స్థానంతో ఫైనల్‌కు చేరాడు. దీంతో శుక్రవారం జరిగే ఫైనల్లో నీరజ్ చోప్రా, అర్షద్ నదీమ్ మధ్య మరో ఆసక్తికర పోరు చూసే అవకాశం ఏర్పడింది.

# రాష్ట్రంలో మాదాసి, మాదారి కురవలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆవేదన

- ఎస్సీ జాబితాలో చేర్చి విద్యార్థులకు సంక్షేమ ఫలాలు అందించాలని వినతి
- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం సమర్పించిన సంఘం నాయకులు
- కురవ ఆచార సంప్రదాయాలకు సంబంధించిన వస్తువులను మంత్రికి అందజేత
- మంత్రివర్గంతో చర్చించి న్యాయం చేస్తామని మంత్రి హామీ





**పత్తికొండ – సూర్య వాస్తవం :** రాష్ట్రంలో మాదాసి, మాదారి కురవలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, ఈ వర్గానికి చెందిన విద్యార్థులు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పూర్తిస్థాయిలో పొందలేక పోతున్నారని మాదాసి, మాదారి కురవ ఎస్సీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కేపీ బ్రహ్మయ్య అన్నారు. పత్తికొండ మండల పరిధిలోని హోసూరు గ్రామంలో సోలార్ కంపెనీ భూమి పూజ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను గురువారం కలిసి, మాదాసి, మాదారి కురవలను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.

ఈ సందర్భంగా మాదాసి, మాదారి కురవల ఆచార సంప్రదాయాలకు సంబంధించిన గొర్రెపిల్ల, కమ్మడి, కరను మంత్రి నారా లోకేష్‌కు నాయకులు సమర్పించారు. వినతిపత్రంపై స్పందించిన మంత్రి నారా లోకేష్, ఈ అంశాన్ని రాష్ట్ర మంత్రివర్గంతో చర్చించి, వారికి న్యాయం జరిగేలా తగిన నిర్ణయం తీసుకుం టామని హామీ ఇచ్చినట్లు కేపీ బ్రహ్మయ్య తెలిపారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ, మంత్రి నారా లోకేష్‌ను కలిసేందుకు అవకాశం కల్పించిన పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మైలార్, రాఘవేంద్రరావు, తుగ్గలి మండల అధ్యక్షుడు ధనుంజయ, కృష్ణగిరి మండల అధ్యక్షుడు లచ్చప్పతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతానికి సమగ్ర చట్టం అవసరం

- పాత చట్టాలతో ఆధునిక ఆరోగ్య సవాళ్లను ఎదుర్కోవడం కష్టం
- వ్యాధుల నివారణకు చట్టపరమైన బలం కీలకం
- ప్రజారోగ్య మౌలిక సేవలే ఆరోగ్య వ్యవస్థకు వెన్నెముక
- ఆరోగ్య భద్రతకు కేంద్రం--రాష్ట్రాల సమన్వయం అవసరం
- డిజిటల్ పర్యవేక్షణతో ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయాలి
- డా . ఎం. అఖిల మిత్ర, ప్రకృతి వైద్యులు డ ప్రజారోగ్య సలహాదారులు



**అనంతపురం వైద్యం– సూర్య వాస్తవం :** ప్రజారోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసి, భవిష్యత్ ఆరోగ్య సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు దేశంలో ఆధునిక, సమగ్ర ప్రజారోగ్య చట్టం అత్యవసరమని ప్రకృతి వైద్యులు, ప్రజారోగ్య సలహాదారులు డా. ఎం. అఖిల మిత్ర పేర్కొన్నారు. ప్రజా రోగ్యం అంటే కేవలం వ్యాధులకు చికిత్స అందించడం మాత్రమే కాదని, వ్యాధుల నివారణ, ప్రజల ఆయుష్షు పెంపు, ఆరోగ్య ప్రోత్సాహం కోసం సమాజం సమిష్టిగా చేపట్టే చర్యల సమాహారమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేసే విధానాన్ని ప్రజారోగ్య చట్టం నిర్దేశిస్తుందని వివరించారు. వ్యాధుల పర్యవేక్షణ, పారిశుద్ధ్యం, ఆహార భద్రత, సురక్షిత తాగునీరు, ఆరోగ్య అవగాహన, వ్యాధి నివారణ వంటి సేవలు ప్రజారోగ్య వ్యవస్థకు పునాదిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ సేవలు ప్రజలకు ప్రత్యక్షంగా కనిపించకపోయినా, ఆరోగ్య వ్యవస్థకు కనిపించని వెన్నెముక వంటివని అన్నారు. ఈ వ్యవస్థలు బలహీనపడితే నివారించగలిగే వ్యాధులు, మరణాలు పెరిగే ప్రమాదం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజారోగ్య ఫలితాలు కేవలం వైద్యరంగంపైనే ఆధారపడవని, పరిశుభ్రత, తాగునీరు, పర్యావరణం, విద్య, పోషకాహారం, పట్టణ ప్రణాళిక వంటి అనేక రంగాల సమన్వయం అవసరమని తెలిపారు. అందుకే సమర్థవంతమైన ప్రజారోగ్య పరిపాలనకు చట్టపరమైన బలం కీలకమని పేర్కొన్నారు. ప్రజారోగ్య చట్టాలు ప్రధానంగా మౌలిక సదుపాయాల చట్టాలు, జోక్య చట్టాలుగా ఉంటాయని వివరించారు. ప్రజారోగ్య సంస్థల ఏర్పాటు, ఆరోగ్య సమాచార సేకరణ, తనిఖీలు, లైసెన్సులు, నియంత్రణ చర్యలకు మౌలిక సదుపాయాల చట్టాలు అధికారాన్ని కల్పిస్తాయని తెలిపారు. మైనర్లకు పొగాకు విక్రయాల నిషేధం, ఆహార భద్రత ప్రమాణాలు, అంటువ్యాధుల సమయంలో ప్రత్యేక నియంత్రణ చర్యలకు జోక్య చట్టాలు చట్టబద్ధత కల్పిస్తాయని పేర్కొన్నారు.

భారతదేశంలో ప్రజారోగ్య అత్యవసర పరిస్థితుల నిర్వహణ ఇప్పటికీ పాత చట్టాలు, శిక్షణ పొందిన ప్రజారోగ్య సిబ్బంది కొరత, అమలు లోపాల కారణంగా ఆశించిన స్థాయిలో లేదని తెలిపారు. భారత రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్ ప్రకారం ప్రజారోగ్యానికి సంబంధించిన చట్ట నిర్మాణ అధికారాలు కేంద్రం, రాష్ట్రాల మధ్య విభజించబడ్డాయని వివరించారు. ఆసుపత్రులు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా వంటి అంశాలు ప్రధానంగా రాష్ట్రాల పరిధిలో ఉండగా, ఆహార భద్రత, సంక్రమణ వ్యాధుల నియంత్రణ, కార్మిక సంక్షేమం వంటి అంశాలపై కేంద్రం, రాష్ట్రాలు రెండూ చట్టాలు చేయగలవని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 14, 15, 21 అధికరణాల నేపథ్యంలో ఆరోగ్య హక్కు జీవించే హక్కులో కీలక అంశంగా గుర్తించబడిందని తెలిపారు. పోషకాహారం, జీవన ప్రమాణాల మెరుగుదల, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్య అభివృద్ధికి ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలని రాష్ట్ర పాలనా దిశానిర్దేశక సూత్రాలు సూచిస్తున్నాయని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత ప్రజారోగ్య చట్టాల రూపకల్పన ప్రధానంగా రాష్ట్రాల బాధ్యతగా కొనసాగిందని, ప్రస్తుతం అమల్లో ఉన్న అనేక చట్టాలు దశాబ్దాల క్రితం రూపొందించబడినవేనని తెలిపారు. పాత చట్టాలు పారిశుద్ధ్యం, నీటి సరఫరా, ఆహార భద్రత, అంటువ్యాధుల నియంత్రణ వంటి అంశాలను ప్రస్తావించినప్పటికీ, యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్, కొత్త అంటు వ్యాధులు, వాతావరణ మార్పులు, పర్యావరణ కాలుష్యం, వేగవంతమైన పట్టణీకరణ వంటి ఆధునిక సవాళ్లను ఎదుర్కొనేంత సమగ్రత అవసరమని అభిప్రాయపడ్డారు. ఆధునిక ప్రజారోగ్య విధానం హక్కుల ఆధారితంగా ఉండాలని, ప్రభుత్వ చర్యలు చట్టబద్ధంగా, శాస్త్రీయ ఆధారాలతో, అవసరమైన మేరకే పరిమితమై ఉండాలని సూచించారు. వ్యక్తిగత స్వేచ్ఛ, గోప్యత, మానవ గౌరవాన్ని కాపాడుతూ ప్రజారోగ్య చర్యలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజారోగ్య మౌలిక సదుపాయాలు, అత్యవసర పరిస్థితులకు ముందస్తు సిద్ధత, డిజిటల్ పర్యవేక్షణ, వివిధ శాఖల సమన్వయం, పారదర్శక పరిపాలన, పౌరుల హక్కుల రక్షణను సమగ్రంగా కలిపిన ఆధునిక ప్రజారోగ్య చట్టాన్ని రూపొందించాలని డా. అఖిల మిత్ర కోరారు. సమాజ సంక్షేమం, వ్యక్తిగత స్వేచ్ఛల మధ్య సమతుల్యతను కాపాడుతూ, శాస్త్రీయ దృక్పథం, రాజ్యాంగ విలువలు, మానవ హక్కులను సమన్వయం చేసే సమగ్ర ప్రజారోగ్య చట్టం ద్వారానే ఆరోగ్యవంతమైన, సురక్షితమైన, స్థిరమైన భారత నిర్మాణానికి బలమైన పునాది వేయవచ్చని పేర్కొన్నారు.

# ఎర్రమిర్చికి ఊహించని ధర

**గుంటూరు–సూర్య వాస్తవం:** మిర్చి పంటను సాగు చేయడం కత్తి మీద సామే. ఏ మాత్రం తేడా వచ్చినా పంటంతా తెగుళ్లే. ఒకవేళ తెగుళ్ల నుంచి కాపాడుకున్నా నాణ్యమైన దిగుబడి రాదు. సరే ఆ వచ్చిన పంటకు గిట్టుబాటు ధర కూడా ఉండదు. దళారులు ఎంత చెప్తే అంతకి ఇచ్చి వెళ్తుంటారు. కానీ ఇక్కడో రైతు బయ్యర్లకే దిమ్మతిరిగే షాక్ ఇచ్చాడు. నెంబర్ వన్ నాటు రకాన్ని సాగు చేసి ఎర్రబంగారంలా మెరిసే మిర్చిని సాగు చేశాడు. రూ. 32 వేలు పలికినా ఇవ్వకుండా రూ. 40 వేల గిట్టుబాటు ధర లభిస్తుందని ఆశిస్తున్నాడు. రైతు వేసిన పంట ఊహించిన దాని కంటే ఎక్కువ ధర పలికిందంటే ఆ రైతు పంట పండినట్టే. ఇక్కడ కూడా ఓ రైతు ఎర్రబంగారం సాగు చేశాడు. గుంటూరు మిర్చి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.. మిర్చే కాదు ధర కూడా ఘాటెక్కింది. టాప్ క్వాలిటీ రావడంతో దళారులు ఆ పంట కోసం ఎగబడుతున్నారు. క్వింటాకు రూ. 32 వేలు ఇస్తామని ముందుకొస్తున్నా.. ఇంకాస్త ఎక్కువ ధర పలుకుతుందన్న ధీమాతో ఆ రైతు విక్రయించడం లేదు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలేనికి చెందిన రైతు చిట్టినేని అమర్‌నాథ్ నాటు రకం సూపర్ 10 డీలక్స్ మిర్చిని నాలుగు ఎకరాల్లో సాగు చేశాడు. ఎకరాకు 20 క్వింటాళ్ల చొప్పున 80 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది జనవరిలో తొలి కాపు రాగా.. ధర పెద్దగా లేకపోవడంతో కోల్డ్‌స్టోరేజ్‌లో పంటను నిల్వ చేశాడు. ఇటీవల కొద్ది కాలంగా గుంటూరు మిర్చి యార్డ్‌లో ధరలు రైతులకు అనుకూలంగా ఉండటంతో తన పంటను విక్రయిం చేందుకు అమర్‌నాథ్ మూడు లాట్ల శాంపిల్స్‌ను తీసుకొచ్చాడు. యార్డులోని శ్రీ కృష్ణవేణి చిల్లీస్ దిగుమతి షాపు వద్దకు తీసుకురావడంతో ఎర్రగా నిగనిగలాడుతున్న ఆ టాప్ క్వాలిటీ మిరపకాయలను చూసి ఎగుమతి దారులు ఆశ్చర్యపోయారు. దాంతో ఆ మిర్చిన కొనేం దుకు చాలా మంది ఆసక్తిచూపారు. మిర్చి క్వింటా ధర రూ. 25 వేల వరకే ఉండేది.. అయితే, రూ. 40 వేలకు అమ్మాలన్న ఉద్దేశంలో రైతు అమర్‌నాథ్ ఉన్నాడు. దాంతో వంద టిక్కీల మిర్చి యార్డులోనే ఉంది. తాను అనుకున్న ధర వచ్చిన తర్వాతే విక్రయించాలని రైతు ఉన్నాడు. పంటకు తెగులు సోకినా తగిన సంరక్షణ చర్యలు తీసుకుని క్వాలిటీ ఏ మాత్రం దెబ్బతినకుండా సాగు చేశాడని.. అందుకే ఈ స్థాయిలో మిర్చి రికార్డు ధర పలికింది అంటూ గుంటూరు ఏఎంసీ వర్గాలు అంటున్నాయి.

# పొంచి ఉన్న ప్రమాదం..!

- ఎండిపోయిన భారీ చెట్టుతో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు



**చెన్నూరు– సూర్య వాస్తవం :** కొండపేట నడిబొడ్డున ప్రజలకు నిత్యం ప్రమాదం పొంచి ఉంది. గ్రామ సచివాల యానికి వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఫారెస్ట్ కాంపౌండ్‌లో భారీ చెట్టు పూర్తిగా ఎండిపోవడంతో అది ఎప్పుడు విరిగి పడుతుందోనన్న భయంతో స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రహదారిపై ప్రతిరోజూ గ్రామ సచివాలయానికి వచ్చే ప్రజలతో పాటు విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు పెద్ద సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. గాలి, వర్షం వచ్చిన సమయంలో చెట్టు కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణనష్టం జరిగే అవకాశం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగే వరకు వేచి చూడకుండా అటవీ శాఖ, గ్రామ పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి ఎండిపోయిన చెట్టును తొలగించాలని, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని వారు కోరుతున్నారు.

# ఘనంగా టెట్ శిక్షణా తరగతుల ముగింపు సభ





**కదిరి – సూర్య వాస్తవం:** ఎన్జీవో హోమ్‌లో జిల్లా కార్యదర్శి మల్లికార్జున అధ్యక్షతన టెట్ ముగింపు సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శులు శెట్టిపి జయ చంద్రారెడ్డి, లక్ష్మీ రాజా, జిల్లా అధ్యక్షులు డి శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ నాయక్, రాష్ట్ర కౌన్సిలర్ తాహెర్ వలి, జిల్లా కార్యదర్శులు అమరనారాయణ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు వేంకటాచలం, రవివర్ధన్ రెడ్డి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ యూటీఎఫ్ కదిరి డివిజన్ అధ్యర్యంలో గత 33 రోజుల గా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు సెలవు రోజులలో కూడా నిర్వహించడం గొప్ప విషయం. ఈ శిక్షణ తరగతులు రాష్ట్ర స్థాయిలో నిర్వహించారని, ఉపాధ్యాయుల ఎటువంటి పరీక్షలైన ఎదుర్కో డానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ప్రభుత్వానికి టెట్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తునే మరో ప్రక్క ఇటువంటి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం విద్యాహక్కు చట్టం సెక్షన్ 23 (1) సవరించాలి అని డిమాండ్ చేస్తున్నాం అన్నారు. ఈ ప్రభుత్వం స్పందించకుంటే మరో సారి రణభేరి లాంటి పెద్ద ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరిక చేసారు. అనంతరం బోధకులు నాగరాజు, రవీంద్రనాథ్,ఓబులపతి,భాస్కర్, రమేష్, వెంకటరమణ, శంకరనారాయణ రెడ్డి, మహేంద్ర రెడ్డి, మహేష్ రెడ్డి, చాంద్ బాషా లను ఘనంగా సన్మానించడం అయినది. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సునీల్, మధుసూదన్, ఆజమ్ బాషా, సంతోష్, పది మండలాల యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తిరుమల తరహాలో కర్నూలు దర్శనాలు

**కర్నూలు –సూర్య వాస్తవం:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశైలంలో భక్తుల దర్శనాల ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగవంతంగా మార్చేందుకు దేవస్థానం ధర్మకర్తల మండలి కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై శ్రీశైల దేవస్థానంలో ప్రొటోకాల్ దర్శనాల్లో సంస్కరణలు తీసుకురావాలని నిర్ణయించింది. మంగళవారం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో సభ్యులందరితో విస్తృతంగా చర్చించిన అనంతరం ఈ మార్పులను ఖరారు చేశారు. ఈ కీలక సమావేశంలో 45 అంశాలపై సమగ్రంగా చర్చించి?. అందులో 39 కీలక అంశాలకు ఆమోదముద్ర వేశారు. సాధారణ భక్తులు గంటల తరబడి వేచి ఉండే ఇబ్బందులు తొలగించి, మరింత సులభంగా దర్శనం కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని ధర్మకర్తల మండలి ఛైర్మన్ రమేష్ నాయుడు స్పష్టం చేశారు. నూతన రూల్స్ ప్రకారం? ప్రజాప్రతినిధులు, ప్రముఖుల సిఫార్సు లేఖలపై ఇచ్చే ప్రోటోకాల్ టికెట్లను వచ్చే నెల ఆగస్టు 15వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారానే జారీ చేస్తారు. ఈ ప్రోటోకాల్ దర్శనం కోరుకునే వారు దర్శన సమయానికి కనీసం 48 గంటల ముందే తమ సిఫార్సు లేఖలను ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా సమర్పించాల్సి ఉంటుంది. ఈ మార్పు ద్వారా భక్తుల రద్దీని సులభంగా నియంత్రించడంతో పాటు, దర్శన వేళల్లో మరింత పారదర్శకత వస్తుందని పాలకమండలి భావిస్తోంది. ప్రముఖుల సిఫార్సు లేఖల పేరిట జరిగే అక్రమాలను అరికట్టడంతో పాటు, సాధారణ భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే అవసరం లేకుండా వేగంగా దర్శనం పొందేందుకు ఈ చర్యలు ఎంతగానో తోడ్పడతాయని ఆలయ ఛైర్మన్ పేర్కొన్నారు. ఇక శ్రీశైలం క్షేత్రాభివృద్ధిలో భాగంగా భక్తుల వసతులకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు. నూతన క్యూ కాంప్లెక్స్, ఏ–గ్రేడ్ శౌచాలయాలు, స్నానపు గదుల నిర్మాణం, తిరుమల తరహాలో పీఏసీ (పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్) ఏర్పాటును ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని నిర్ణయించారు. ప్రధాన గోపురాలకు రంగురంగుల విద్యుద్దీపా లంకరణ చేయనున్నారు. భక్తుల విశ్రాంతి కోసం నందీశ్వర మరియు నీలకంఠేశ్వర సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు బాగా పండి దేశం సస్యశ్యామలంగా ఉండాలని కాంక్షిస్తూ ఆగమ శాస్త్రానుసారంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆగస్టు 7 నుంచి 11వ తేదీ వరకు వరుణయాగ సహిత సహస్రఘ టాభిషేకాన్ని అత్యంత వైభవంగా నిర్వహిం చనున్నట్లు ఛైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక అర్చనలు, హోమాలు, జపాలు , పారాయణలు శాస్త్రోక్తంగా జరుగుతాయి.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )